ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	40.1	29.0
కావలి	37	29
ఆత్మకూరు	40	29
ఉదయగిరి	39	28
కందుకూరు	37	29

నిర్వహణకు నీళ్లొదిలారా !?

- రూ.500 కోట్లతో నిర్మించిన బ్యారేజీలు గాలికి..
- సంగం, నెల్లూరు బ్యారేజీల వద్ద టెక్నికల్ సిబ్బంది కొరత
- గేట్లు ఆపరేట్ చేయలేక ఇరిగేషన్ అధికారుల అవస్థలు
- ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపినా రాని అనుమతులు

సోమశిల, కండలేరు జలాశయాలు జిల్లాకు ఎంతటి జీవనాడి వంటివో.. సంగం, నెల్లూరు బ్యారేజీలు కూడా అంతే. ఆ రెండు జలాశయాలు నీటిని నిల్వ చేస్తే, ఈ రెండు బ్యారేజీలు ఆ నీటిని కాలువలకు మళ్లిస్తూ సాగులో కీలకంగా ఉంటాయి. ఇంతటి ప్రాధాన్యం గల బ్యారేజీలను దాదాపు రూ.500 కోట్లతో నిర్మించారు. అయితే నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు. నాడు వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి ముందుచూపు లేకుండా పనులు పూర్తికాకుండా బ్యారేజీలను ప్రారంభించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అదే నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)



నెల్లూరు బ్యారేజీ



సంగం బ్యారేజీ

ఎక్కడైనా బ్యారేజీలు ప్రారంభిస్తే దాని నిర్వహణ చాలా ముఖ్యం. కానీ సంగం, నెల్లూరు బ్యారేజీల విషయంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రెండు బ్యారేజీలను దాదాపు రూ.500 కోట్లతో నిర్మించినా ఆ బ్యారేజీలను నిర్వహించేందుకు మాత్రం సిబ్బంది లేకుండాపోయారు. నిర్మాణ సంస్థలకు ఇంకా మెయింటెనెన్స్ పీరియడ్ ఉంది కదా..అని ఉన్నతాధికారులు మొదట నెట్టుకొచ్చారు. అయితే ఆ సంస్థలకు బిల్లులు చెల్లించక పోవడంతో మెయింటెనెన్స్‌ను పట్టించుకోలేదు. నెల్లూరు బ్యారేజీకి సంబంధించి కాంట్రాక్టర్‌కు నిర్వహణ పీరియడ్ పూర్తి కాగా , ఒకటి, రెండు నెలల్లో సంగం బ్యారేజీ నిర్వహణ కాలపరిమితి కూడా పూర్తి కానుంది. కానీ ఇప్పటికీ ఈ బ్యారేజీల గేట్లు ఎత్తేవారు... దించేవారు కరువ య్యారు. ఈ విషయంలో ఇరిగేషన్ అధికారులు నానాహైరానా పడుతున్నారు. రెండేళ్ల నుంచి కాలువలకు నీటి విడుదల చేసే సమయంలో ఇరిగేషన్ సిబ్బందికి ఆ ప్రాజెక్టుల వద్ద విధులు కేటాయించి ఎలాగోలా నెట్టు కొస్తున్నారు. ఒక వేళ భారీ వరద వచ్చి గేట్లు ఎత్తాల్సి వస్తే పరిస్థితి ఏమిటని తీవ్రఆం దోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ లేకపోవడంతో నూతనంగా నిర్మిం చిన గేట్లు కిందకు దిగేందుకు, పైకి లేచేందుకు ఇబ్బందిగా మారాయి. నెల్లూరు బ్యారేజీ వద్ద సర్వేపల్లి కెనాల్‌కు నీటిని మళ్లించే మొదటి గేటే పూర్తిగా కిందకు దిగడం లేదు. ఇక్కడ లీకేజీ జరుగుతుండడంతో సర్వేపల్లి కాలువలో పూడిక తీసేందుకు ఇబ్బందిగా మారింది.

రూ.2 కోట్లు లేవట!

గతంలో సంగం, నెల్లూరు ఆనకట్టలు ఉండేవి. ఆ సమయంలో లస్కర్లు ఇక్కడ చెక్కలు ఎత్తేవారు, దించేవారు. అయితే ఇప్పుడు బ్యారేజీలు నిర్మించడంతో గేట్ల ఆపరేషన్‌కు టెక్నికల్ సిబ్బంది అవసరం. ఈ గేట్ల నిర్వహణపై ఇరిగేషన్ అధికారులకు అవగాహన లేకుండా పోయింది. సంగం బ్యారేజీలో 88 గేట్లు, నెల్లూరు బ్యారేజీలో 57 గేట్లు ఉన్నాయి. శిక్షణ పొందిన సిబ్బంది మాత్రమే ఈ బ్యారేజీల నిర్వహణ చేయగలుగుతారు. దీంతో క్షేత్రస్థాయి ఇరిగేషన్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా ఫలితం కనిపించడం లేదు. సంగం బ్యారేజీ నిర్వహణకు 28 మంది, నెల్లూరు బ్యారేజీకి 20 మంది అవసరమని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం అనుమతివ్వడం లేదు. మరి టెక్నికల్, నాన్‌టెక్నికల్ సిబ్బంది లేకుండా ప్రాజెక్టులను ఎలా ఆపరేట్ చేయాలని ఇరిగేషన్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. దాదాపు రూ.500 కోట్లతో నిర్మించిన ఈ రెండు బ్యారేజీల ఫలితంగా ఏటా రూ.వేల కోట్ల పంట ఉత్పత్తులు వస్తున్నాయి. అయితే ఏటా రూ.2 కోట్లతో నిర్వహణ చేయలేక పోతుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.



నిబంధనల చట్రంలో 'నీట్'

- నేడు 10 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 2,913 మంది విద్యార్థులు
- కట్టుదిట్టంగా అధికారుల ఏర్పాట్లు

నెల్లూరు(విద్య), మే 3 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి ఆదివారం జరిగే జాతీయస్థాయి అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)కు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పరీక్ష నిర్వహణలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కఠిన నిబంధనలను అమలు చేస్తున్నది. తొలిసారిగా ఈ ఏడాది జిల్లాలోని విద్యార్థులందరికీ నెల్లూరు కేంద్రంగానే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పది కేంద్రాల ఏర్పాటు

నీట్ పరీక్షకు నెల్లూరులో పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి జిల్లావ్యాప్తంగా 2,913 మంది దరఖాస్తు చేశారు. పరీక్షల్లో కాపీయింగ్, పేపర్ లీకేజీ వంటి సంఘటనలకు ఆస్కారం లేకుండా చేసేందుకు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. విద్యార్థులంతా నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందే.

పరీక్ష కేంద్రాలివే..

నెల్లూరు నగరంలోని స్టౌన్‌హౌస్‌పేట వీఎస్ఆర్ ఎంసీహెచ్ స్కూల్, కొత్తూరు పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం, దర్గామిట్టలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఏసీ నగర్ ఎంపీఎల్ కార్పొరేషన్ హైస్కూల్, పొదలకూరు రోడ్డులోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పప్పులవీధిలోని వైవీఎం నగరపాలక ఉన్నత పాఠశాల, సంతపేట ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రా లను ఏర్పాటు చేశారు. జిల్లా అధికార యంత్రాంగం, ఎన్‌టీఏల పర్యవేక్షణలో జరిగే ఈ పరీక్షకు ఒక్కో కేంద్రానికి ఒక్కో జిల్లా అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించారు.

క్షుణ్ణంగా తనిఖీలు

పరీక్ష హాల్లోకి వచ్చిన విద్యార్థులు వారికి కేటాయించిన సీటులో కూర్చున్న తరువాత ఇన్విజిలేటర్ వచ్చి అడ్మిట్ కార్డులోని వివరాలను పరిశీలించాక క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. వారి వద్ద ఎలాంటి స్లిప్పులు, నిషేధిత సామగ్రి లేవని నిర్ధారించుకున్న తర్వాత 1.45 గంటలకు ఓఎంఆర్ బుక్‌లెట్‌లు పంపిణీ చేస్తారు. అనంతరం 1.50 గంటలకు గైర్హాజరైన విద్యార్థుల ఓఎంఆర్ షీట్లను స్వాధీనం చేసుకుని 1.55 నిమిషాలకు ఇచ్చిన బుక్‌లెట్‌లపై వివరాలు నమోదు చేయిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు కచ్చితంగా పరీక్ష ప్రారంభమవుతుంది..

అనుమతులు ఇలా...

ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్ష జరగనుంది. 11 గంటల నుంచి విద్యార్థులకుఉ తనిఖీలు ప్రారంభించి, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష హాల్లోకి పంపాక ప్రధాన గేట్లు మూసి వేస్తారు. ఆ తర్వాత వచ్చే విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. పరీక్ష కేంద్రంలోకి వచ్చిన విద్యార్థులకు సూచనలు ఇవ్వడం, ఓఎంఆర్ షీట్ పూర్తిచేయించేందుకు అరగంట సమయాన్ని కేటాయిస్తారు. సాయంత్రం 5 గంటల తర్వాత పరీక్ష రాసిన విద్యార్థులను బయటకు పంపిస్తారు. ప్రత్యేకావసరాలు కలిగిన విద్యార్థులకు మాత్రం సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష నిర్వహించి, అనంతరం బయటకు పంపిస్తారు.

ఆంక్షలు కఠినతరం

విద్యార్థుల వస్త్రధారణ, ఆభరణాలపై ఆంక్షలు విధించారు.అన్నీ కేంద్రాల వద్ద పోలీసు యంత్రాంగం పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. పరీక్ష కేంద్రంలోకి అనుమతించే ముందు విద్యార్థులను మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేయనున్నారు. హ్యాండ్‌బ్యాగులు, బెల్టులు, టోపీ, డెబిట్, క్రెడిట్‌కార్డులతో సహా చేతికి గడియారాన్ని సైతం అనుమతించరు. చివరకు వాటర్‌బాటిళ్లను కూడా నిషేధించారు. విద్యార్థినులు చెవులకు రింగులు, చెవిదిద్దులు, ముక్కుపుడక, మెడలో గొలుసులు, నెక్లెస్ వంటి ఆభరణాలతోపాటు జడకు పిన్నులు, క్లిప్స్‌తో కూడా రాకూడదు. లేతరంగు వస్త్రాలే ధరించి రావాలి. పంజాబీ డ్రస్‌లు లేత రంగులోనే ఉండాలి. హాఫ్ హ్యాండ్స్ కలిగి ఉన్న షర్టులు, టాప్‌లే ధరించాలి. షర్టులకు పెద్ద పెద్ద బటన్‌లతోపాటు స్టిక్కర్‌లు అతికించి ఉండకూడదు. షైహీల్స్ చెప్పులు, బెల్టులు, బూట్లతో వస్తే అనుమతించరు. సాధారణ పాదరక్షలే ధరించాలి. కాగా విద్యార్థులు తమ వెంట అడ్మిట్ కార్డుపై పోస్ట్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు అతికించి, మరొక పాస్‌పోర్టు సైజు, పోస్ట్‌కార్డు సైజ్ ఫొటో వెంట తీసుకురావాలి. పరీక్ష రాసేందుకు పెన్నులను ఆయా కేంద్రాల్లోనే అందచేస్తారు. సమయం తెలిసేలా పరీక్ష హాల్లో గడియారాలను కూడా ఏర్పాటు చేశారు.



అల్లీపురం పీహెచ్‌సీ

అధ్వానం.. అల్లీపురం పీహెచ్‌సీ

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుపై గ్రేడ్‌ల కేటాయింపు
- 'ఏ' గ్రేడ్‌కు నోచని జిల్లాలోని పీహెచ్‌సీలు
- 'బీ' గ్రేడ్‌లో 11, 'సీ'లో 36, 'డీ'లో 4

నెల్లూరు (వైద్యం) మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీల) పనితీరుపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రతినెలా గ్రేడ్‌లను ప్రకటిస్తుంది. అయితే గత ఆరునెలల నుంచి ఈ గ్రేడ్‌లను ప్రకటించలేదు. ఎన్నికల నేపథ్యంలో వీటిని ప్రకటించలేదు. తాజాగా మార్చి నెలకు సంబంధించి గ్రేడ్‌లను ప్రకటించింది. యథావిధిగా బీ,సీ,డీ గ్రేడ్‌లు తప్ప జిల్లాలోని ఒక్క పీహెచ్‌సీకి కూడా ఏ గ్రేడ్ రాలేదు. దీన్నిబట్టి చూస్తూ పీహెచ్‌సీల పనితీరు ఎలా ఉందో తెలుస్తోంది. మార్చి నెలకు సంబంధించి తాజా వివరాలను ఈ నెల ఒకటిన విడుదల చేసింది. ఇందులో అల్లీపురం పీహెచ్‌సీ తీరు పరమ అధ్వానంగా ఉన్నట్లు తేలింది.

గ్రేడ్‌ల కేటాయింపు ఎలాగంటే..

ఆయా పీహెచ్‌సీకి రోజువారీ ఎంత మంది రోగులు వస్తున్నారు. వారికి అందించే వైద్య పరీక్షలు, గర్భిణులకు అందిస్తున్న సేవలు, ప్రసవాలు వంటి వాటిని పరిశీలించి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ గ్రేడ్‌లు కేటాయిస్తుంది. అయితే జిల్లాలోని పీహెచ్‌సీల పనితీరుపై వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన ఫలితాలలో అన్నీ కేంద్రాలు చాలా వెనుక బడినట్లు తేలింది. జిల్లాలో 52 పీహెచ్‌సీలు ఉండగా, అందులో అల్లీపురం పీహెచ్‌సీ అసలు ఏ గ్రేడ్‌కు కూడా ఎంపిక కాలేదు. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ కేంద్రంలో ప్రజలకు వైద్య సేవలు సరిగ్గా అందటం లేదన్న విషయంపై రాష్ట్ర ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా కసుమూరు, గుండ్లపాళెం, దగదర్తి తదితర 37 పీహెచ్‌సీల్లో అసలు ప్రసవాలే జరగలేదని గణాంకాలు చెబుతున్నట్లు తేల్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించాలన్న ఉద్దేశంతో జిల్లాకు రూ.25 కోట్లకుపైగా విడుదల చేస్తుంది. ఒక్కో పీహెచ్‌సీలో అత్యవసర మందుల కోసం రూ. 1.75 లక్షల వంతున విడుదల చేస్తుంది. ఇంతఖర్చు చేస్తున్నా ప్రజలకు వైద్యసేవలు సక్రమంగా అందడం లేదు.

ఎక్కువ 'సీ'గ్రేడే..

బీ గ్రేడ్‌లో 11 పీహెచ్‌సీలు నిలచాయి. సీ గ్రేడ్‌లో 36, డీ గ్రేడ్‌లో 4 పీహెచ్‌సీలు నిలిచాయి. మొత్తం మీద జిల్లాలోని పీహెచ్‌సీలు 55 శాతం ప్రజలకు మాత్రమే వైద్య సేవలు అందించినట్లు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ వెల్లడించింది.

మెరుగైన చికిత్సలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని పీహెచ్‌సీల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. రాష్ట్రంలోనే ఏ గ్రేడ్‌లో నిలిచేందుకు కృషి చేస్తున్నాం. ప్రతి రోజూ పీహెచ్‌సీల పనితీరును పరిశీలిస్తున్నాం. ఎక్కడ లోపాలు ఉన్నాయో తెలుసుకుని వాటిని సరిదిద్దుతున్నాం.



- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

లేఅవుట్ల అక్రమాలపై

మళ్లీ విచారణ

- మున్సిపల్ శాఖ జీవో జారీ
- రేపటి నుంచి పరిశీలన

నెల్లూరు జడ్పీ,మే3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లేఅవుట్ల అక్రమాలు, నుడా అనుమతులిచ్చిన లేఅవుట్లపై మళ్లీ విచారణను మున్సిపల్‌శాఖ చేపట్టనున్నది. ఇందుకు సంబంధించి శనివారం మంత్రి ఆశాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వంలో ఏర్పాటైన అక్రమ లేఅవుట్లను, నుడా అనుమతులిచ్చిన లేఅవుట్లను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రెండు నెలల్లోనే జిల్లాలోని లేఅవుట్లపై విచారణ చేపట్టారు. ఇందులో 230 అక్రమ లేఅవుట్లుగా ఉన్నట్లు అధికారులు లెక్కతేల్చారు. అయినా వాటిపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 230 కంటే ఎక్కువే అక్రమ లేఅవుట్లు ఉన్నాయని, అయితే అప్పటి విచారణ అధికారులు రియల్టర్లతో కుమ్మక్కై తొక్కిపెట్టారనే ఆరోపణ లు వ్యక్తమయ్యాయి. దీంతో మళ్లీ విచారణకు ఆదేశించారు. ఇందుకోసం పురపాలకశాఖ మంత్రి టౌన్‌ప్లానింగ్‌కి చెందిన 14 మంది అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వీరితో పాటు నుడాకు చెందిన మరో ముగ్గురు కూడా మున్సి పాలిటీలు, పంచాయతీల్లో ఉన్న లేఅవుట్లను స్థానిక అధికారులతో కలిసి సోమవారం నుంచి పరిశీలించనున్నారు.

కుక్కలదాడిలో 14 పొటేళ్ల మృతి

కోవూరు, మే3, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపాళెంలో శనివారం వేకువజామున వీధి కుక్కలు దాడి చేయడంతో 14 పొట్టేళ్లు మృతి చెందాయి. గ్రామానికి చెందిన పామర్తి శ్రీనివాసులు పొటేళ్ల పెంపకం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో 50 పొట్టేళ్లను ప్రతిరోజూ పొలానికి తోలుకెళ్లి రాత్రి సమయానికి పాక వద్దకు తోలుకువచ్చేవాడు. ఈ క్రమంలో శ్రీనివాసులు శుక్రవారం రాత్రి కూడా పాకలో పొట్టేళ్లను తోలి జాగ్రత్తలు తీసుకున్నాడు. తెల్లవారి చూసేసరికి వీధి కుక్కలు దాడి చేసి 14 పొట్టేళ్లను హతమార్చడంతో హతాశుడయ్యాడు. పొటేళ్ల మృతితో తనకు రూ,1.50లక్షలు నష్టం వచ్చిందని బాధితుడు వాపోయాడు.



కుక్కల దాడిలో మృతి చెందిన పొట్టేళ్లు

దరఖాస్తు గడువు పొడిగింపు

నెల్లూరు(లీగల్), మే 3(ఆంధ్రజ్యోతి) : జిల్లా యూనిట్‌లోని నెల్లూరు, కోవూరు, ఆత్మకూరు, కావలిలలో ఖాళీగా ఉన్న నాలుగు, రెండవ తరగతి స్పెషల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పాపిరెడ్డి చెరువులో పాగా

- స్థలాలు ఆక్రమించిన బడాబాబులు
- ఆపై బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం
- విలువ రూ.100 కోట్లకుపైగానే..
- ఆక్రమణదారులకు సీసీ రోడ్ల ఏర్పాటు
- మామూళ్ల మత్తులో అధికారగణం

పాపిరెడ్డి చెరువులో నిర్మించిన ఐదంతస్తుల భవనం



కావలి, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రంకురోడ్డుకు కూతవేటు దూరంలో ఉన్న పాపిరెడ్డి చెరువు లోతట్టు ప్రాంతాలు ఆక్రమణలకు గురయ్యాయి. అక్కడ స్థలాలు ఆక్రమించినవారు పేదవారనుకుంటే పొరపాటే. అంతా బడాబాబులే. ఇక్కడ అంకణం విలువ రూ.3 లక్షలకు పైగానే ఉంటుంది. 30 అంకణాలు ఆక్రమిస్తే దాని విలువ రూ. కోటి ఉంటుంది. బడాబాబులు ఒక్కొక్కరు రెండు,మూడు ప్లాట్లు ఆక్రమించుకున్నారు. అంతేకాక అధికారులకు మామూళ్లు ఇచ్చి పెద్ద పెద్ద భవంతులు కూడా నిర్మించి అద్దెలకు కూడా ఇచ్చారు. ఒక వ్యక్తి అయితే ఏకంగా ఐదు అంతస్తులు నిర్మిస్తున్నా అడిగేవారు లేరు. అయితే చెరువులో అక్రమంగా నిర్మించే ఇళ్లకు మున్సిపల్ అధికారులు ఎలా అనుమతులు ఇస్తున్నారో..ఎవరికీ అర్థం కావడం లేదు.

హద్దులు నిర్ణయించినా ఆక్రమణలు

పదేళ్ల కిందట పాపిరెడ్డి చెరువును సర్వే చేసి హద్దులు నిర్ణయించి, రాళ్లు పాతారు. అప్పటికే చెరువులోతట్టు ప్రాంతంలో పెద్ద పెద్ద భవనాలు వెలిశాయి. అయితే వారంతా బడాబాబులు కావటంతో వాటిని తొలగించకుండా అధికారులు కాలయాపన చేశారు. కొంతమంది భవనాలు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో అధికారులు తొలగిస్తారేమోనని వారు కోర్టును ఆశ్రయించారు. వీటిని ఆసరా చేసుకుని చెరువు లోతట్టు ప్రాంతంలోకి ప్రతిఏటా కొంతమంది జొరబడి పోతున్నారు. కబ్జాదారులంతా ఏపార్టీ అధికారంలో ఉంటే వారికి మద్దతుగా నిలుస్తుండటంతో ఆక్రమణల తొలగింపుపై అధికారులపై ఒత్తిడి చేసే వారు లేకుండాపోయారు. దీంతో ఒకరిని చూసి మరొకరు చెరువును ఆక్రమించుకున్నారు. అయితే అధికారులు మామూళ్ల మత్తులో వాటి గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రూ. వందకోట్లకుపైగానే స్థలాల ఆక్రమణ

పాపిరెడ్డి చెరువు లోతట్టు ప్రాంతంలో భవనాలు నిర్మించిన స్థలాల విలువ లెక్కకడితే రూ.100 కోట్లకు పైనే ఉన్నట్లు తెలుస్తోంది. బడాబాబులు భవంతుల నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఎవరికివారు తమకెందుకులే అని పట్టించుకోవడంలేదు. సాధారణంగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలంటే మున్సిపల్ అధికారులు సవాలక్ష నిబంధనలు పెడుతుంటారు. అయితే చెరువులో స్థలాలకు ఎలా అనుమతులు ఇచ్చారో అర్థం కావటం లేదు. ఆక్రమణదారులు కొందరు పదవీవిరమణ చేసిన, చనిపోయిన తహసీల్దార్ల పేరు మీద డీ.ఫారం పట్టా చూపిస్తుండగా, మరి కొందరు సర్వే నంబర్లు మార్చి దొంగ రిజిష్టర్లు చేసుకున్నారు. అది చెరువు లోతట్టు ప్రాంతమని అన్నీ శాఖల అధికారులకు తెలిసినా, తమ మామూళ్లు తమకు వస్తే చాలన్నట్లు వారు పట్టించుకోవటంలేదనే ఆరోపణలు ఉన్నాయి. కచ్చా రోడ్లు కూడా లేని ప్రాంతాలు పట్టణంలో కోకొల్లలు. అయితే చెరువు ఆక్రమణ ప్రాంతంలో బడాబాబులకోసం సీసీ రోడ్లు నిర్మించారంటే అధికారులు, పాలకులు ఎంతకైనా తెగిస్తున్నట్లు అర్థమవుతోంది. వాస్తవంగా నీటి వనరులకు చెందిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా, అక్కడ నిర్మాణాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇరిగేషన్, రెవెన్యూ అధికారులపై ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాపిరెడ్డి చెరువును మళ్లీ సర్వే చేసి, ఆక్రమణలను తొలగించాల్సి ఉంది.



భవనవాసుల కోసం చెరువులో వేసిన సీసీ రోడ్డు

మున్సిపల్ అధికారులే అడ్డుకోవాలి

పాపిరెడ్డి చెరువులోతట్టు ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాలను మున్సిపల్ అధికారులే అడ్డుకోవాలి. ప్రస్తుతం ఎక్కడైనా కొత్తగా నిర్మా ణాలు చేపడుతున్న విషయం తమ దృష్టికి తెస్తే వాటిని అడ్డుకుంటాం

- పీఎం ఖాన్, జలవనరుల శాఖ ఇన్‌చార్జి ఈఈ

గత ప్రభుత్వంలో అనుమతులు ఇచ్చారు..

పాపిరెడ్డి చెరువులో అక్రమ నిర్మాణాలకు తాము అనుమతులు ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో అనుమతులు ఇచ్చినట్లుగా ఉన్నారు. తాజాగా అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే మాత్రం అడ్డుకుంటాం. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన భవనాల అనుమతులను పరిశీలించి, చర్యలు తీసుకుంటాం.

- వివేకానంద్, టీపీవో



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

కోన బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

● అధికారులకు మంత్రి ఆనం దిశానిర్దేశం

రాపూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని దేవదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈనెల 8 నుంచి 14 వరకు జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన శనివారం జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో మంత్రి ఆనం, ఆర్డీవో నాగసంతోషిణి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆనం మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, ఫెస్టివల్ కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవ, కల్యాణోత్సవం రోజుల్లో భక్తులకు ఉచితంగా స్వామివారి లడ్డూప్రసాదం పంపిణీకి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. వేసవి దృష్ట్యా భక్తులకు క్యూలైన్లలో వాటర్ బాటిల్స్, మజ్జిగ, చంటి బిడ్డలకు పాలు, బిస్కెట్లు అందించాలని, భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు, 24 గంటలు పనిచేసేలా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవదాయ శాఖకు సంబంధించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలుచేశామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫెస్టివల్ కమిటీ ఛైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, నెల్లూరు, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఈవో శ్రీనివాసులురెడ్డి, డీఎస్పీ వేణుగోపాల్, ఫెస్టివల్ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



పొదలకూరు సీహెచ్‌సీలో డయాలసిస్ చేయించుకుంటున్న వ్యక్తితో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్, సోమిరెడ్డి తదితరులు

లోకల్ మద్యం తాగడం వల్లే ఆరోగ్య సమస్యలు

● వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్

పొదలకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో పేద ప్రజలు లోకల్ మద్యం (జే బ్రాండ్లు) తాగడం వల్లే లివర్, కిడ్నీ, న్యూరో కేసులు అధికమయ్యాయని, తాము నిర్వహించిన సర్వేలో తేలిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్ అన్నారు. పొదలకూరు సీహెచ్‌సీలో 8 పడకలతో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని శనివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నాయకులు ధనార్జన కోసం, వేలాదిమంది పేద ప్రజల ప్రాణాలతో నాసిరకం మద్యంతో ఆడుకున్నారన్నారు. అనేకమంది మహిళల పుస్తెలు నిలువునా తెంచారన్నారు. వైసీపీ హయాంలో ఆటవిక పాలన చూశామని పేర్కొన్నారు.

● కాకాణిని పట్టిస్తే గిఫ్ట్‌గా కరోనా ప్యాలెస్

ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి చిక్కడు, దొరకడు.. ఎక్కడున్నాడో తెలియదన్నారు. అతడ్ని పట్టిస్తే కరోనా ప్యాలెస్‌ను గిఫ్ట్‌గా ఇస్తామన్నారు. ఐదు వారాలైనా ఆయన ఆచూకీ తెలియలేదన్నారు. పొదలకూరు సీహెచ్‌సీలో వైద్య సేవలు మెరుగ్గా అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తలచీరు మస్తాన్‌బాబు, రాధా కృష్ణమనాయుడు, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కలిచేటి ప్రభాకర్ రెడ్డి, పులిపాటి వెంకటరత్నంనాయుడు, గంటా మల్లికార్జున యాదవ్ పాల్గొన్నారు.

సోమశిలలో 50.994 టీఎంసీల నీరు

అనంతసాగరం, మే 3 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి 50.994 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 1,000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

50 శాతం రాయితీపై
సమీకృత పశుదాణా

● చిన్న, సన్నకారు పాడిరైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

● జిల్లాకు మొదటి విడతగా 250 మెట్రిక్ టన్నులు ● పాడిపరిశ్రమ అభివృద్ధి దిశగా ప్రభుత్వం

నెల్లూరు(వ్యవసాయం), మే 3(ఆంధ్రజ్యోతి): వేసవిలో వేడిగాలుల తీవ్రత పశువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ పరిస్థితులను తగ్గించేందుకు ప్రభుత్వం ఇప్పటికే గ్రామాల్లో అవసరమైన చోట తాగునీటి తొట్టెల ఏర్పాటు చేస్తున్నది. అంతేకాక పశుగ్రాస క్షేత్రాలను కూడా రైతులకు చేరువ చేసింది. తాజాగా కొత్తగా 50శాతం రాయితీపై సమీకృత పశుదాణా అందచేస్తున్నది. ముందుగా చిన్న, సన్నరైతులకు మాత్రమే అందించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీ) డాక్టర్ రమేష్‌నాయక్ తెలిపారు. ఒక్కో రైతుకు నెలకు 150కేజీల చొప్పున మూడు నెలల పాటు ఈ దాణాను అందించనున్నామని ఆయన తెలిపారు.

● ఒక్కోరైతుకు 450 కేజీలు

వేసవిలో పశువుల్లో సాధారణంగా పాల దిగుబడి తగ్గుతుంది. దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం ఇప్పటికే వేసవిలో పశుయాజమాన్య పద్ధతులపై పశుసంవర్ధకశాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించింది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులకు ఒత్తిడి పెరిగి పాల ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దీన్ని తగ్గించేందుకు పశువులకు బలమైన ఆహారం అవసరం. దీన్ని రైతులకు రాయితీపై అందించడం వల్ల పాలదిగుబడి తగ్గకుండా ఉంటుంది. ముందుగా చిన్న,



కమ్మపాళెంలో పాడిరైతులకు నాణ్యమైన సమీకృత దాణా పంపిణీ చేస్తున్న జేడీ రమేష్‌నాయక్

సన్నకారు రైతులకు అందించేలా ప్రణాళికలు రూపొందించింది. తెల్లరేషన్ కార్డు కలిగిన పాడిరైతులకు 50శాతం రాయితీపై అందించాలని పశుసంవర్ధకశాఖకు ఆదేశాలు అందాయి. అదికూడా నెలకు 150 కేజీల చొప్పున మూడు నెలలపాటు 450 కేజీలు ఇవ్వాలని, తద్వారా పాడిరైతుకు ఆర్థికంగా కొంత ఉపశమనం లభిస్తుంది. నాణ్యమైన సమీకృత దాణా 50కేజీల బస్తా మార్కెట్ రేటు రూ.1110లు కాగా, 50శాతం రాయితీ పోగా రూ.555లు రైతు చెల్లిస్తే సరిపోతుంది.

● 75శాతం రాయితీపై గడ్డి విత్తనాలు

వేసవిలో తాగునీరు అందించేందుకు అవసరమైన నీటి తొట్టెల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో 916 నీటితొట్టెలు అవసరమని అధికారులు గుర్తించారు. ఇందులో ఇప్పటికి దాదాపుగా 70శాతం వరకు పూర్తి చేశారు. వేసవిలో పశువులకు అవసరమైన పచ్చిగడ్డి అందుబాటులో ఉంచేందుకు పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నది. 1200 ఎకరాల్లో పచ్చిగడ్డి పెంచేందుకు అనుమతులు లభించాయి. ఇవన్నీ కూడా డ్వామా పర్యవేక్షణలో జరుగుతున్నాయి.. వీటితోపాటు 75శాతం రాయితీపై గడ్డి విత్తనాలు కూడా రైతులకు అందుబాటులో ఉంచారు. ఒక్కో రైతుకు సుమారుగా 30 కేజీల విత్తనాలు అందించనున్నది. మొదటి విడతగా ఇప్పటికే 49 మెట్రిక్ టన్నులను రైతులకు పంపిణీ చేశారు. రెండోవిడతగా మరో 55 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు.

50 రాయితీపై పశుదాణా



పశువులకు నాణ్యమైన సమీకృత దాణాను 50శాతం రాయితీపై రైతులకు అందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లాలో మొదటి విడతగా 250 మెట్రిక్ టన్నుల సమీకృత దాణాను పాడిరైతులకు అందుబాటులో ఉంచాం. రెండో విడతగా మరో 338 మెట్రిక్ టన్నుల పశుదాణా కూడా తెప్పించాం. తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అవసరమైన చోట నీటి తొట్టెలను ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకున్నాం. జిల్లాలో సుమారు 1200 ఎకరాలకుగాను 615 ఎకరాల్లో పచ్చిగడ్డి పెంపకానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- డాక్టర్ రమేష్‌నాయక్, పశుసంవర్ధకశాఖ జేడీ

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

● రూరల్ డీఎస్పీకి నుడా ఛైర్మన్ వినతి



నెల్లూరు రూరల్ డీఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు(క్రైం), మే 3(ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణా వెనుక ఎవరున్నా వదలొద్దని, దీనదయాల్‌నగర్‌లో పట్టించిన ఇసుక టిప్పర్లకు సంబంధించిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని రూరల్ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్‌కు శనివారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి, మంత్రి నారాయణకు చెడ్డ పేరు తీసుకొస్తే సహించనని హెచ్చరించారు. పేద ప్రజలకు ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొస్తే కొందరు అక్రమార్కులు ఈ పాలసీని అడ్డం పెట్టుకొని దోచుకుంటున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో వైసీపీ ఎమ్మెల్యేలు ఇసుకను కూడా పందికొక్కుల్లా దోచుకున్నారని, వారు చేసిన అవినీతి అక్రమాల వల్లే ప్రజలు 11 సీట్లు ఇచ్చారన్నారు. ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తే దాన్ని కొందరు తోడేళ్ల రాత్రి సమయాల్లో దోచుకుంటున్నారన్నారు. భారీ యంత్రాలు, జేసీబీలతో కొందరు రాబందువులు పెన్నమ్మ గర్భానికి తూట్లు పొడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుకాసురులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరామన్నారు.



సుదర్శన్‌కు నియామక పత్రం అందజేస్తున్న జేసీ కార్తీక్

జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడిగా శేషం సుదర్శన్

● నియామక పత్రం అందజేసిన జేసీ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ (వెట్టిచాకిరి నిర్మూలన చట్టం) సభ్యుడిగా మర్రిపాడు మండలం రాంపల్లి గ్రామానికి చెందిన శేషం సుదర్శన్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శేషం సుదర్శన్ మాట్లాడుతూ కార్మికుల హక్కులు, బడిఈడు చిన్న పిల్లలచే వెట్టిచాకిరి చేయించే పారిశ్రామిక రంగాలు, వివిధ సంస్థల్లో పని చేస్తున్న వారిని గుర్తిస్తామన్నారు. వారి సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కమిటీలో చోటు కల్పించిన కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్‌కి సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణికి ధన్యవాదాలు తెలిపారు.

మహిళా క్రీడాకారులే మనకు ప్రేరణ

● ఎంపీ బీద మస్తాన్‌రావు ● ముగిసిన మహిళల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్

● టోర్నీ విజేత కొల్హాపూర్ శివాజీ యూనివర్సిటీ జట్టు

● విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీ బీద మస్తాన్‌రావు, వీసీలు అల్లం శ్రీనివాసరావు, ఉమా

వెంకటాచలం, మే 3 (ఆంధ్రజ్యోతి): మహిళలు క్రీడారంగంలో అద్భుతంగా రాణిస్తున్నారని.. వారు మైదానంలో చూపిస్తున్న పట్టుదల మనందరికీ ప్రేరణగా నిలుస్తోందని ఎంపీ బీద మస్తాన్‌రావు అన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీలో నాలుగురోజులుగా జరుగుతున్న జాతీయ అఖిల భారత అంతర యూనివర్సిటీల మహిళల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ శనివారంతో ముగిశాయి. ఈ టోర్నీలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మహారాష్ట్ర రాష్ట్రంలోని కొల్హాపూర్ శివాజీ యూనివర్సిటీ మహిళా జట్టు, పంజాబ్ రాష్ట్రం లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ మహిళా జట్టు పోటాపోటీగా తలపడ్డాయి. ప్రతిభ చూపిన శివాజీ యూనివర్సిటీ మహిళా జట్టు గెలుపొంది ప్రథమస్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా పలు యూనివర్సిటీల నుంచి 95 జట్లు పాల్గొన్నాయి. 4 రోజుల పాటు జరిగిన టోర్నీలో మూడురోజులు నాకౌట్ దశలో మ్యాచ్‌లు నిర్వహించారు. ఓటమి లేకుండా విజయం సాధించిన హర్యానా రాష్ట్రం రోహతక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ, పంజాబ్ రాష్ట్రం పగ్వారాలోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, మహారాష్ట్ర రాష్ట్రం కొల్హాపూర్‌లోని శివాజీ యూనివర్సిటీ, పంజాబ్ రాష్ట్రం అమృత్సర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలు లీగ్ దశకు చేరుకున్నాయి. ఈ నాలుగు జట్ల మధ్య శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా మ్యాచ్‌లు జరిగాయి. అత్యుత్తమ ప్రతిభ చూపిన శివాజీ యూనివర్సిటీ టోర్నమెంట్ విజేతగా నిలిచింది. అలాగే ద్వితీయ స్థానంలో పంజాబ్ రాష్ట్రం లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, తృతీయ స్థానంలో హర్యానా రాష్ట్రం రోహతక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీలు నిలిచాయి. అనంతరం టోర్నమెంట్ ముగింపు వేడుక సందర్భంగా వీఎస్‌యూలోని క్రీడామైదానంలో శనివారం రాత్రి విజేతలకు ట్రోఫీలను అందజేసి బహుమతులను ప్రదానం చేశారు. ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ఉమాలు హాజరై విజేతలకు బహుమతులు, క్రీడాకారులకు మెడల్స్, ధ్రువీకరణ పత్రాలను అందజేసి అభినందించారు.

● నేడు పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నీ ప్రారంభం

వీఎస్‌యూలో ఆదివారం నుంచి ఈనెల 8 వరకు అఖిల భారత అంతర యూనివర్సిటీల పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా పలు యూనివర్సిటీల నుంచి 97 పురుషుల జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనున్నాయి. వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పురుషుల టోర్నమెంట్ ప్రారంభ వేడుక జరగనున్నది. ఈ వేడుకకు రాష్ట్ర మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ రవినాయుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

చెస్ రేటింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ఏపీ చెస్ సంఘం కార్యదర్శి

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చెస్ రేటింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఏపీ చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ అన్నారు. నగరంలోని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లిలో ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు జరిగిన రతన్‌టాటా స్మారక అంతర్జాతీయ ఫిడే ఓపెన్ చెస్ రేటింగ్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన జూనియర్ క్రీడాకారులు సీనియర్ రేటింగ్ క్రీడాకారులపై గెలుపొందడం అభినందనీయమన్నారు. ఆర్‌ఎల్ చెస్ అకాడమీలో నిత్యం శిక్షణ పొందే 9 ఏళ్ల బి.సూర్యనివాస్ సీనియర్స్ ఓపెన్ పోటీల్లో ప్రథమస్థానం సాధించి రూ.50వేల బహుమతి పొందాడన్నారు. అండర్-7లో బి.మోక్షనివాస్ రూ.10 వేలు సాధించాడన్నారు. వీరితో పాటు అండర్-7లో బి.షాన్విక్ రాజ్, అండర్-9లో ఎం.దీక్షితలు ప్రోత్సాహక బహుమతులు సాధించి ఉత్తమ క్రీడాకారులుగా నిలిచారన్నారు. ఆ క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎల్ చెస్ అకాడమీ కోచ్‌లు రామ్, లక్ష్మణ్, తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), మే 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని విజయమహల్ గేటు సమీపంలో గుర్తుతెలియని రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం జరిగింది. మృతుడు 45 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి, బ్లూ అండ్ వైట్ చెక్స్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్, సిమెంట్ కలర్ ఫ్యాంటు ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్నా నదిలో గుర్తు తెలియని మృతదేహం

నెల్లూరురూరల్, మే 3(ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్లోని దీన్ దయాళ్‌నగర్ వద్ద పెన్నా నది ఒడ్డున గుర్తు తెలియని మృతదేహాన్ని శనివారం స్థానికులు గుర్తించారు. రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాల మేరకు.. పెన్నానదిలో 45 ఏళ్ల వయస్సున్న వ్యక్తి కొట్టుకు వచ్చాడు. అతను మరణించి మూడు రోజులు అయివుంటుందని భావిస్తున్నారు. మృతుడు పచ్చ రంగు నిక్కరు ధరించి ఉన్నాడు. మృతుడి ఆన వాళ్లు తెలిసిన వారు రూరల్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు రాయితీపై విత్తనాలు అందించాలి

● రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు



సమావేశమైన రైతు సంఘం ఆఫీసు బ్యారర్లు

నెల్లూరు(వైద్యం), మే 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన రైతు సంఘం జిల్లా ఆఫీసు బ్యారర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి కారులో వాతావరణం అనుకూలించక దిగుబడులు బాగా తగ్గాయన్నారు. జిల్లాలో ధాన్యానికి కనీస మద్దతు ధర కూడా అందలేదన్నారు. జిల్లాలో 15 లక్షల పుట్లు ధాన్యం రైతులు పండించగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా లక్ష పుట్లు కూడా కొనుగోలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పుట్టికి రూ.3 వేలకు పైగా ధర తగ్గించి అమ్ముకోవాల్సి వచ్చిందన్నారు. రెండవ పంటకైనా సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంగయ్య, సహాయ కార్యదర్శులు జనార్దన్, వెంకటకృష్ణయ్య, ఉపాధ్యక్షులు చంద్ర రాజగోపాల్, గండవరపు శ్రీనివాసులు, రమేష్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లు సమయపాలన పాటించండి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు(వైద్యం), మే 3(ఆంధ్రజ్యోతి): ల్యాబ్ టెక్నీషియన్‌లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన ల్యాబ్ టెక్నీషియన్‌ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎల్‌టీలు ఎఫ్‌ఆర్‌ఎస్ ఖచ్చితంగా వేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీకి రాష్ట్రస్థాయి వైద్యాధికారులు ఎప్పుడైనా రావచ్చని, అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 63 రకాల వైద్య పరీక్షలు చేయాలని, వెంటనే ఫలితాలు వెల్లడించి రోగులకు సరైన వైద్యం అందేలా చూడాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి నిర్దేశించిన లక్ష్యాలను నమోదు చేయాలన్నారు. క్షయ అనుమానిత కేసులకు పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ మలేరియా రక్తపూతలు తీసే విధానంపై ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్‌లు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ ప్రారంభం



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

నెల్లూరు(విద్య), మే 3(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం అండర్-14 సౌత్‌జోన్ బాలబాలికల టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు సౌత్‌లో వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరు కాగా వీరికి ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పించారు. తొలిరోజు పోటీలను డీఎస్‌డీవో ఆర్‌కె. యతిరాజ్, నెల్లూరు రూరల్ టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలు క్రికెట్ ఆడి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి పోటీల్లో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పిట్టి మల్లికార్జున, రాష్ట్ర టెన్నిస్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్‌డీ.ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు యుగంధర్, నిర్వాహక కార్యదర్శి అజయ్ కుమార్, సభ్యులు మల్లిక, చరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న చుక్కల దుప్పి మృతి

● అంత్యక్రియలు నిర్వహించిన బీట్ ఆఫీసర్, పశువైద్యులు

కావలి రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపూజీనగర్ సమీపంలోని అటవీప్రాంతంలో శనివారం చుక్కల దుప్పిపై వీధి కుక్కలు దాడి చేశాయి. కుక్కల దాడిని గుర్తించిన స్థానిక యువకులు దుప్పిని కాపాడి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అశోహరి వెంకట్రావ్‌కు అప్పగించారు. ఆయన గాయాలతో ఉన్న దుప్పిని ఆటోలో పట్టణంలోని పశు వైద్యశాలకు తరలించారు. వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ కామేశ్వరరావు, సర్వాయపాలెం పశువైద్యుడు వెంకటేశ్వరనాయక్, గౌరవరం గ్రామీణ పశు వైద్యశాల వీఎల్‌వో చంద్రశేఖర్‌లు దుప్పికి చికిత్స చేస్తుండగానే మృతి చెందింది. దీంతో దుప్పిని ఉదయగిరి రోడ్డులోని నగరవనానికి తరలించి పంచనామా అనంతరం పశువైద్యుల సమక్షంలో బీట్ ఆఫీసర్ అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన వెంట అటవీశాఖకు చెందిన శ్రీను, వెంకయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఐదు గేదెల మృతి

● నిలిచిపోయిన జయపూర్ ఎక్స్‌ప్రెస్



రైలుపట్టాల పక్కన పడి ఉన్న గేదె కళేబరం

బిట్రగుంట, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే ఎల్‌సీగేట్ 144 సమీపంలో విజయవాడ వైపు వెళుతున్న జయపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని 5 గేదెలు శుక్రవారం రాత్రి మృతి చెందాయి. స్థానికుల వివరాల మేరకు.. 10 గంటల సమయంలో వేగంగా వస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు వరుసగా గేదెలను ఢీకొనడంతో పెద్ద శబ్దాలు వచ్చాయి. ఒకదాని తరువాత మరొక గేదెను ఢీకొనడాన్ని డ్రైవర్ గుర్తించి రైలును నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. గేట్‌మన్ ద్వారా సమాచారం తెలుసుకున్న స్టేషన్ మాస్టర్ పీడబ్ల్యూఐ అధికారిని అప్రమత్తం చేసి సిబ్బందితో పట్టాలపై ఉన్న పశు కళేబరాలను తొలగింపచేశారు. సుమారు పదినిమిషాల పాటు ఎక్స్‌ప్రెస్ రైలు ఆగి తర్వాత పరుగు కొనసాగించింది. గేదెగేదెకు మధ్యదూరం ఉండటంతో రైలు ప్రమాదానికి గురికాలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై రైల్వే పోలీసులను వివరాలు కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

విజిలెన్స్ అధికారులు చెరువుల తనిఖీ

కావలి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు చెరువులను శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గతంలో ప్రపంచబ్యాంకు నిధులతో మండలంలోని చలంచర్ల, పట్టణంలోని మండాడి, పాపిరెడ్డి చెరువులకు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం చెరువుల పరిస్థితి ఎలా ఉందనే దానిపై విజిలెన్స్ డీఈ మహిత, ఏఈ అవినాష్‌రెడ్డిలు కావలి జలవనరులశాఖ ఏఈ జంపాని కిరణ్‌లతో పరిశీలించారు.

3 ఆంధ్రజ్యోతి నవ్య కుటుంబ కదంబం ఆదివారం 4 మే 2025







"37 మంది హీరోలతో సినిమాలు తీసి అత్యధిక హిట్స్ ఇచ్చిన ఏకైక దర్శకుడు ఆయన ఒక్కరే. అలాగే 77 మంది హీరోయిన్లతో చిత్రాలు తీసిన ఘనత ఇండియాలో రాఘవేంద్రరావుకు మాత్రమే సొంతం."

నేను రుణపడేది ఆయనకే!

తెలుగు సినిమాకు మాస్ హంగులు అద్ది, బాక్సాఫీసును షేక్ చేసిన దర్శకుడు... తెలుగు పాటను రంగులతో అభిషేకించి, సంగీతంతో సంబరాలు చేయించిన సంగీతాభిమాని. హిట్స్, రికార్డ్ బ్రేక్ కలెక్షన్లు, సిల్వర్ జూబ్లీలు, పొగడ్తలు... ఇలా అన్నీ కట్టకట్టుకువచ్చి మీదపడినా.. అన్నిటినీ చిరునవ్వుతో స్వీకరించడం తప్ప, స్టేజ్ మీద కానీ, మరెక్కడైనా కాని అహంకారంతో ఎప్పుడూ ఆయన మాట్లాడలేదు... 'గ్లామర్, గుట్టల గుట్టల పండ్లు, నాయికల నాభి తప్ప... అంతకంటే ఏం తియ్యగలడు' అనే వాళ్లకు 'అన్నమయ్య' అనే అద్భుతాన్ని అందించి తన ప్రతిభను పండించుకున్న ఆ దర్శకుడు... కె. రాఘవేంద్రరావు. యాభై ఏళ్ల కెరీర్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆ దర్శకేంద్రుడు తన సినీ పయనంలో ఎదురైన ఆసక్తికరమైన సంఘటనలను, విశేషాలను 'నవ్య'కు వివరించారిలా...



మీరందరూ యాభై ఏళ్లు అయిందని చెబుతుంటే ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే 'పరిశ్రమలోకి వచ్చి ఇన్నేళ్లు అయింది, ఇన్ని సినిమాలు చేశాను' అని నేను ఎప్పుడూ లెక్క పెట్టుకోలేదు. నా పని నేను చేశాను. 'వెయ్యి కోట్ల రూపాయలు కావాలా, డైరెక్షన్ ఛాన్స్ కావాలా?' అని ఎవరైనా ఆఫర్ ఇస్తే... ఇప్పటికీ దర్శకత్వాన్నే కోరుకుంటా. డైరెక్షన్ అంటే నాకు అంత పిచ్చి. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఒకే ఒక వ్యక్తికి రుణపడి ఉంటాను. ఆయనే ఎన్టీఆర్. 'పాండవ వనవాసం' చిత్రంతో పరిశ్రమలోకి ప్రవేశించి, రామారావుగారి మీద తొలి క్లాప్ ఇచ్చాను. అలాగే ఆయన నటించిన 'అడవిరాముడు' సినిమా నుంచే అగ్ర దర్శకుడిగా ఎదిగాను. ఆ రోజు రామారావుగారి మీద క్లాప్ ఇచ్చిన తర్వాత ప్రేక్షకులు ఇన్నేళ్లుగా నా సినిమాలు చూస్తూ ఇన్ని క్లాప్స్ కొడతారని ఊహించలేదు. సినిమా పాటకు ప్రేక్షకులు పట్టాభిషేకం చేసిన సినిమా 'అడవిరాముడు'. రామారావుగారు నడిచి వస్తుంటే ఆ రోజుల్లో జనం పూలు జల్లేవారు, హారతులు ఇచ్చేవారు. 'ఆయన నడిచి వస్తేనే ఇలా చేస్తున్నారు, ఏనుగు ఎక్కిస్తే ఇంకెంత ఆనందిస్తారో?' అని అడవిరాముడు తీశాను. ఆ సినిమాలోని 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' పాట చూసి జనం డబ్బులు విసరడం మొదలుపెట్టారు. అప్పటినుంచి మా కాంబినేషన్‌కు క్రేజ్ మొదలైంది. అలాగే నిర్మాతలు లేకపోతే నేను లేను. ఈ యాభై ఏళ్ల జర్నీ ఇంత విజయవంతంగా సాగడానికి నా నిర్మాతలే కారణం. నాతో పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, పంపిణీదారులకు, థియేటర్ యజమానులకు, నన్ను ఆదరించిన ప్రేక్షకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు.

• హీరో కావాలని అనుకోలేదు

నాకు సినిమాలు అంటే చాలా చాలా ఇష్టం. పుస్తకాలు కొనుక్కోమని ఇంట్లో డబ్బులు ఇస్తే అవి కొనకుండా సినిమాలకు వెళ్లి, స్నేహితుల పుస్తకాలు చదివిన రోజులు ఉన్నాయి. దాదాపు ప్రతి రోజూ సినిమా చూసిన సందర్భాలు ఉన్నాయి. నాకు మొదటి నుంచీ నటన మీద ఆసక్తి లేదు. దర్శకుడినవ్వాలనేదే నా కోరిక. నటుడినో, హీరోనో కావాలని ఎప్పుడూ అనుకోలేదు.

• లక్ష రూపాయలతో తొలి సినిమా అనుకున్నా

ఎన్టీఆర్, కృష్ణ తొలిసారిగా కలసి నటించిన 'స్త్రీ జన్మ' చిత్రానికి నాన్నగారు దర్శకుడు. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌ని. సెట్‌లో నా ఇన్‌వాల్వ్‌మెంట్, పనితీరు గమనించిన ఆ చిత్ర నిర్మాత రామానాయుడు గారు "రాఘవేంద్రరావ్.. నీ ఫస్ట్ పిక్చర్ నాకే చెయ్యాలి" అనేవారు. "ఇప్పుడు కాదు.. తర్వాత చూద్దాంలే" అన్నారు నాన్నగారు. ఆ తర్వాత నా ఫ్రెండ్స్ ఏవీఎం సీజర్, అడుసుమిల్లి కుమార్, గోపాలకృష్ణ కలసి నా దర్శకత్వంలో సినిమా తీద్దామని వచ్చారు. "ఎవరూ చేయని విధంగా సినిమా తీద్దాం. పల్లెటూరికి వెళ్దాం. లక్ష రూపాయల బడ్జెట్‌లో తీద్దాం" అన్నాను. "లేదు లేదు భారీ బడ్జెట్‌లో తీద్దాం" అన్నారు వాళ్లు. 'బాబు' సినిమాకు మా నాన్న కథ ఇచ్చారు. శోభన్‌బాబు హీరో. ముగ్గురు హీరోయిన్లు. చాలా భారీగా తీశాం. నాకు తొలి అవకాశం ఇచ్చిన ఆ ముగ్గురు మిత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు. సినిమాకు మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. అయితే మా సినిమా విడుదలైన కొన్ని రోజులకు విశ్వనాథ్‌గారి 'జీవనజ్యోతి' రిలీజ్ అయింది. ఆ చిత్రం చూడగానే నా సినిమా భవిష్యత్ అర్థమై పోయింది. ఊహించినట్లుగానే 'జీవనజ్యోతి' వచ్చాక మా సినిమా వసూళ్లు తగ్గాయి.

• మూడు తరాల హీరోలతో...

నేను నిర్మాతల దర్శకుణ్ణి. ఎక్కువ రోజులు షూటింగ్ చేసి నిర్మాతను ఇబ్బంది పెట్టలేదు. అందుకే ఒక్కో నిర్మాతకు చాలా సినిమాలు చేసే అవకాశం కలిగింది. నా అదృష్టం ఏమిటంటే.. నా దర్శకత్వంలో నటించడానికి ఏ హీరోకానీ, నటుడు కానీ 'నో' అనలేదు. మూడు తరాల హీరోలతో పని చేశాను. అందరికీ గుర్తుండిపోయే హిట్స్ ఇచ్చే అవకాశం దక్కడం నా అదృష్టం.

• ఆ టెన్షన్ ఉండేది

రామారావుగారు ఒక సినిమా కోసం దాదాపు 40 రోజుల పాటు ఔట్‌డోర్‌లో ఉండడం అన్నది 'అడవిరాముడు'తోనే మొదలు. అంతవరకూ ఆయనకు ఔట్‌డోర్ అంటే మద్రాసు గిండీ ఫారెస్టే. అటువంటి వ్యక్తి ఈ చిత్రకథ నచ్చి అన్ని రోజులు ఔట్‌డోర్‌లో ఉండిపోయారు. మధ్యలో ఒకటి రెండు సార్లు 'దానవీరశూర కర్ణ' చిత్రం రీరికార్డింగ్ కోసం మద్రాసు వెళ్లి వచ్చారేమో! 'ఈ సినిమా ఆడకపోతే నా కెరీర్ ఏమవుతుందా?' అనే టెన్షన్ 'అడవిరాముడు' చేస్తున్నప్పుడు నాకు ఉండేది. చిన్న సినిమాలు చేసుకో వచ్చు కానీ రామారావుగారు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టుదలతో పని చేశాను. రామారావుగారు షూటింగ్ ముగించుకుని వెళ్లిపోతూ "నా కెరీర్‌లో ఇది మధుర జ్ఞాపకం' అని మెచ్చుకోవడం మరిచిపోలేని సంఘటన. ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు కూడా నా హీరోలు ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్... ఎవరూ నిరుత్సాహపరిచేలా మాట్లాడలేదు. నాకు ఎంతో సపోర్ట్ ఇచ్చారు. అది వారి గొప్పతనం. ముఖ్యంగా రామారావుగారు. ఆయనకు 'సింహబలుడు', 'తిరుగులేని మనిషి' అని రెండు ఫ్లాప్స్ ఇచ్చాను. ఆయన వద్దు అనుకుంటే నాకు మరో అవకాశం వచ్చేది కాదు.. కానీ ఆయన గొప్పతనం ఏమిటంటే.. "ఇట్సాల్ రైట్ బ్రదర్.. ఏం తీయకూడదో నేర్చుకున్నాం. ఈ సారి మంచి కథతో ప్లాన్ చేయండి..' అన్నారు., ఆయన ఆఖరి చిత్రం 'మేజర్ చంద్రకాంత్' చేసే అవకాశం నాకు దక్కడం నా అదృష్టం. అందుకే ఏ ఫంక్షన్‌కు వెళ్లినా "రామారావుగారి వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను" అని చెబుతుంటాను.

• సోషల్ మీడియాను కంట్రోల్ చెయ్యాలి


సోషల్ మీడియాను కంట్రోల్ చేసే పరిస్థితి రావాలి. ముఖ్యంగా కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్ పెట్టే హెడ్డింగ్స్ ఇబ్బందికరంగా ఉంటున్నాయి. వాటిని అదుపు చేయాలి. ఈ విషయంలో నేను కూడా ఓసారి ఇబ్బంది ఎదుర్కొన్నా. అయితే వాటిని నేను పట్టించుకోను కనుక రియాక్ట్ కాలేదు. కానీ రాను రాను విచ్చలవిడితనం పెరిగిపోతోంది.

• పాటలో మొత్తం రామాయణం

నా కెరీర్‌లో అన్ని రకాల చిత్రాలూ చేశాను. 'అన్నమయ్య', 'శ్రీరామదాసు', 'పాండురంగడు'. 'మంజునాథ' 'శిరిడి', 'నమో వేంకటేశ' లాంటి సినిమాలు చేశాను. ఇప్పుడు ఓ పాటలో మొత్తం రామాయణాన్ని చూపించాలని నా కోరిక . దానికి సంబంధించిన టెస్ట్ షూట్ కూడా చేశా. అలాగే 'వల్లీ కల్యాణం' కూడా సినిమాగా తీయాలనే ఆలోచన ఉంది.

• వినాయకరావు

ఇప్పుడు తీరికే లేదు



'పెళ్లిసందడి' చిత్రం మళ్లీ తీసిన తర్వాత ఏం చేయాలా అని నాకు తోచలేదు. ఇన్ని సంవత్సరాలు వర్క్ చేసిన తర్వాత న్యాయంగా అయితే రిటైర్ అవ్వాలి, కానీ నాకు పని లేకపోతే తోచదు. అప్పుడు బాగా ఆలోచించి యూ ట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశా. షార్ట్ ఫిల్మ్స్ తీసి అప్‌లోడ్ చేస్తున్నా. పిల్లలకు సంబంధించి రెండేసి నిముషాల షార్ట్ ఫిల్మ్స్ ఏ.ఐ.లో తీస్తున్నాం. దానికోసం తీరిక లేకుండా వర్క్ చేస్తున్నా. కీ బోర్డ్ నేర్చుకుంటున్నా. అలాగే 'కెఆర్ఆర్ క్లాస్‌రూమ్' పేరుతో సినిమాల గురించి ప్రాక్టికల్ నాలెడ్జిని ఔత్సాహికులకు ఉచితంగా చెబుతున్నా.

28 రోజుల్లో 'జ్యోతి'



ఒక పెద్ద సినిమా తీసిన వెంటనే ఓ చిన్న చిత్రం తీయడం చాలా మంచిది. ఆ పద్ధతిని చాలా రోజులు కొనసాగించా. ప్రేక్షకులు అంచనాలు పెంచుకునే అవకాశం ఇవ్వకూడదు. ఎందుకంటే 'ఏం తీస్తాడు, ఎలా తీస్తాడు..' అని వారంతా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందుకే రెండో సినిమా 'జ్యోతి'ని ప్రయోగాత్మకంగా 28 రోజుల్లో తీశాను. మురళీమోహన్, జయసుధ జంటగా నటించారు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. మురళీమోహన్‌తో చేసిన 'కల్పన' చిత్రం విడుదల అయిన వారం రోజులకు 'అడవిరాముడు' వచ్చింది. ఈ రెండు సినిమాలూ హిట్ అయ్యాయి. అలాగే 'సింహబలుడు' చిత్రం భారీ బడ్జెట్‌తో తయారైతే, ఆ సమయంలోనే 'పదహారేళ్ల వయసు' చిత్రం లోబడ్జెట్‌తో వచ్చింది.

ముగ్గురు హీరోలతో 'త్రివేణి సంగమం'



నా నూరవ సినిమాను మొదట చాలా విభిన్నంగా ప్లాన్ చేశాను. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్‌లతో ఆ సినిమా చేయాలని అనుకొని వారిని అడిగాను. ముగ్గురూ ఒప్పుకొన్నారు. 'త్రివేణి సంగమం' అని టైటిల్ అనుకున్నా. ఈ సినిమాను అరవింద్, అశ్వనీదత్‌లతో కలసి తీయాలిన ప్లాన్ చేశా. అయితే పాటల విషయంలో అభిమానుల మధ్య అభిప్రాయ బేధాలు వస్తాయేమో అనే అనుమానం వచ్చి ఆ ప్రాజెక్ట్ ఆపేశాం. అప్పుడు ఓ కొత్త హీరోతో చిన్న సినిమా తీద్దామని అల్లు అర్జున్‌ను పరిచయం చేస్తూ 'గంగోత్రి' తీశాం.

మరచిపోలేని మూడు సంఘటనలు



యాభై ఏళ్ల కెరీర్‌లో మరచిపోలేని మధుర సంఘటనలు మూడు ఉన్నాయి. 'అడవిరాముడు' చిత్రంతోనే పాటలు వచ్చినప్పుడు తెరపైకి డబ్బులు విసరడం అనే ట్రెండ్ మొదలైంది. అలాగే 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' చిత్రం పెద్ద తుపాన్ వచ్చిన సమయంలో విడుదల అయింది. చాలా థియేటర్లలో షోలు పడని పరిస్థితి. కానీ ఒక థియేటర్‌లో మాత్రం వర్షపు నీటిని మోటార్లు పెట్టి బయటకు తోడేస్తుంటే, జనం కుర్చీల్లో కాళ్లు పెట్టుకుని ఆ సినిమా చూశారు. 'అన్నమయ్య' చిత్రంలో 'మోకాళ్ల పర్వతాన్ని చెప్పులు వేసుకుని ఎక్కకూడదు' అని భానుప్రియ నాగార్జునకు చెప్పే సీన్ వచ్చినప్పుడు థియేటర్‌లో ప్రేక్షకులు కూడా చెప్పులు విడిచిపెట్టి సినిమా చూశారు.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్	THE DIPLOMAT	
ది డిప్లొమాట్	హిందీ చిత్రం	మే 09
గుడ్ బ్యాడ్ అగ్లీ	తమిళ చిత్రం	మే 08
ది రాయల్స్	హిందీ సిరీస్	మే 09
అమెజాన్ ప్రైమ్	Royals	
గ్రామ్ చికిత్సాలయ్	హిందీ చిత్రం	మే 09
జియో హాట్‌స్టార్		
స్టార్‌వార్స్	యానిమేషన్ సిరీస్	మే 04

వినోదాత్మక చికిత్స



ఓ మారుమూల పల్లెలో ప్రభుత్వ ఆస్పత్రి నేపథ్యంలో తెరకెక్కిన హిందీ సిరీస్ 'గ్రామ్ చికిత్సాలయ్'. అక్కడి వసతుల లేమి, వైద్యుల నిర్లక్ష్యంతో అమాయక గ్రామీణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వారి చేతుల్లో దోపిడీకి గురవుతుంటారు. ఈ పరిస్థితుల్లో బదిలీపై ఆ గ్రామానికి వచ్చిన ప్రతిభావంతుడైన యువ వైద్యుడు ప్రభాత్ ఆ పరిస్థితులను మార్చాలని కంకణం కట్టుకుంటాడు. ఆ నేపథ్యంలో అతనికి ఎదురైన సవాళ్లు ఏమిటి, ప్రజలు అతనికి సహకరించారా అనేది వినోదాత్మకంగా ఈ సిరీస్‌లో ఆవిష్కరించారు. అమోల్ పరాశర్ వినయ్ పాఠక్, ఆకాంక్ష రంజన్ కీలకపాత్రలు పోషించారు. రాహుల్ పాండే దర్శకుడు.

బియ్యం నీళ్లు చేసే అద్భుతం..!

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ... శిరోజాలు రాలడం, అవి నిర్జీవంగా మారడం, వాటి చివర్లు చిట్లడం, చుండ్రు లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని నివారించేందుకు బియ్యం నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఇలా తయారు చేసుకోవాలి...

- ఒక గిన్నెలో ఒక కప్పు బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడగాలి. వెంటనే రెండు కప్పుల నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. తరవాత ఈ నీటిని మరో గిన్నెలోకి వడకట్టాలి.
- బియ్యాన్ని నీటిలో రెండు రోజులు నానబెడితే ఆ నీటిని 'ఫెర్మెంటెడ్ వాటర్' అంటారు. ఈ నీళ్లు మాడుకు, శిరోజాలకు అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. ఫెర్మెంటెడ్ వాటర్‌ను ఫ్రిజ్‌లో వారంపాటు నిల్వ చేసుకోవచ్చు.



- బియ్యం నీటిలో లావెండర్ లేదా రోజ్‌మేరీ ఆయిల్ చుక్కలు వేసుకుంటే ఫలితం బాగుంటుంది.
- బియ్యం నీళ్లలో బి, ఇ విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

ఇలా వాడాలి...

- ముందుగా శిరోజాలను కుంకుళ్లు లేదా గాఢత తక్కువగా ఉన్న షాంపూతో శుభ్రం చేసుకోవాలి. తలను కొద్దిగా ఆరనివ్వాలి. తరవాత బియ్యం నీటిని చేత్తో తీసుకుంటూ కురులకు, మాడుకు పట్టించాలి. బియ్యం నీటిని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తలంతా చిలకరించుకోవచ్చు. అయిదు నిమిషాల తరవాత తలను వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావుగంటసేపు ఆరనిచ్చి మంచినీళ్లతో తలను శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

విమానం ఎక్కేముందు...

విమానం ఎక్కేముందు కొన్ని రకాల ఆహార పదార్థాలు తినకపోవడమే మంచిదనీ లేదంటే ప్రయాణంలో అనారోగ్య సమస్యలు తప్పవనీ నిపుణులు చెబుతున్నారు.

- సాధారణంగా అల్పాహారం కింద బ్రోకలీ, క్యాబేజీ తురుము, వెనిగర్ వేసి తయారు చేసిన సలాడ్స్ తీసుకుంటూ ఉంటారు. వీటివల్ల గ్యాస్ చేరి కడుపు ఉబ్బరిస్తుంది. ఉదయం వేళ విమాన ప్రయాణం చేయాల్సి ఉంటే వీటిని తినకపోవడమే మంచిది.
- విమానం ఎక్కడానికి ఒక రోజు ముందు నుంచి బీన్స్, పప్పు దినుసులు తినకూడదు. ఇవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి విమానం ఎక్కగానే కడుపులో సమస్యలు ఏర్పడవచ్చు.
- నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, వీధుల్లో అమ్మే పదార్థాలు తినకూడదు. వీటివల్ల కడుపులో వికారం, వాంతులు, తలనొప్పి లాంటి ఆరోగ్య సమస్యలు రావచ్చు.
- విమానం ఎక్కడానికి గంట ముందు నుంచి కార్బొనేటెడ్ డ్రింక్స్, ఆల్కహాల్ తీసుకోకూడదు. వీటివల్ల కడుపులో తిప్పడం, తల తిరగడం, తేన్పులు, కడుపు ఉబ్బరించడం లాంటివి ఏర్పడవచ్చు. సరిగా నిద్ర పట్టక అలసటగా అనిపిస్తుంది.
- కొంతమందికి చూయింగ్ గమ్ నమలడం, క్యాండీస్ తినడం అలవాటుగా ఉంటుంది. వీటివల్ల కూడా సమస్యలు ఏర్పడవచ్చు.
- విమానం ఎక్కేముందు కారంగా ఉన్నవి, మసాలాలు చేర్చిన ఆహార పదార్థాలు తినకూడదు. వీటి వల్ల గుండెలో మంటగా అనిపిస్తుంది.



అద్భుతమైన మహిళల కోసం

నూట తొంభై ఐదు దేశాలు... పది లక్షలమంది మహిళలు... వారి జీవన స్థితిగతులు... 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' పేరుతో మహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు... విశాఖకు చెందిన భరద్వాజ్ దయాల. వివిధ దేశాల్లో విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళల జీవితాలను ప్రతిబింబిస్తూ ఒక డాక్యుమెంటరీ రూపొందిస్తున్నారు. ఏడాదిన్నరలో బైక్‌పై ఐదు ఖండాలు, 16 దేశాలు చుట్టివచ్చిన ఆయన... 'నవ్య'తో ఆ విశేషాలు పంచుకున్నారు.



"సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం. భారీ జీతం. కానీ జీవితమంటే సంపాదన మాత్రమే కాదని కొన్నేళ్ల ఉద్యోగ జీవితం తరువాత అనిపించింది. దానికితోడు కొత్తగా ఏదైనా చేయాలన్న తపన నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. దాంతో 2006లో బైక్‌పై ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టాను.

ఐదు ఖండాల్లోని 16 దేశాల మీదుగా 48 వేల కిలోమీటర్లు ప్రయాణించాను. ఏడాదిన్నరపాటు సాగింది ఈ యాత్ర. బైక్‌పై ప్రపంచ యాత్ర పూర్తి చేసిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందాను. ఆ యాత్ర విశాఖలో ప్రారంభమై... ఇరాన్, టర్కీ, సిరియా, జోర్డాన్ మీదుగా ఆఫ్రికా, ఈజిప్ట్, యూరప్‌లోని గ్రీస్ వరకూ సాగింది. ఆ తరువాత ఫ్రాన్స్ మీదుగా యూకే అట్లాంటిక్ సముద్రం దాటి కెనడా, అమెరికా చేరుకున్నా. పసిఫిక్ మహా సముద్రం దాటి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ మీదుగా భారత్‌కు వచ్చాక మళ్లీ ఉద్యోగ జీవితంలో నిమగ్నమయ్యాను. ఈ క్రమంలోనే మా అమ్మ కుసుమ దయాల్ ఐదుగురి సంతానాన్ని పెంచి పోషించేందుకు చేసిన త్యాగం, పడిన కష్టాలు గుర్తుకువచ్చాయి. అమ్మ లాంటి ఎంతోమంది మాతృమూర్తుల గురించి ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటేషన్‌కు శ్రీకారం చుట్టాను.

సంపాదించింది అంతా...

ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాను. దీని కోసం ఇప్పటివరకూ నేను సంపాదించింది అంతా ఖర్చు చేస్తున్నాను. దీనిలో భాగంగా నా కారును ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నాను.

దేశదేశాల్లోని మహిళల జీవితాలతో...

195 దేశాల్లోని విభిన్న రాష్ట్రాలు, జాతులు, కులాలు, మతాలు, వర్గాలకు చెందిన పది లక్షల మంది మహిళల జీవితాలను ఆవిష్కరించడమే 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటరీ ప్రధాన ఉద్దేశం. ఉన్నత స్థాయి నుంచి కూలి పనులు చేసుకునే మహిళల వరకు అందరి జీవితాలకు సంబంధించిన కీలక ఘట్టాలు అందులో ఉంటాయి. ఇప్పటివరకూ ఇలా ఇన్ని దేశాల మహిళల ఫొటోగ్రఫీలతో కూడిన డాక్యుమెంటు ఎవరూ చేయలేదు. అందుకే నేను ఈ మహత్తర కార్యం చేపట్టాలని అనుకున్నాను.

మహిళా దినోత్సవంనాడు...

'మిలియన్ అమేజింగ్ ఉమెన్స్' డాక్యుమెంటేషన్ పూర్తికావడానికి పది నుంచి పన్నెండేళ్ల సమయం పడుతుందని అంచనా. గత నెల, అంటే మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని బరోడా నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాను. ఇందులో తొలి పోర్ట్రైట్ ఫొటో బరోడా రాజమాత సుభాంగిని రాజేది. బ్రిటిష్ రాణి కంటే అతిపెద్ద కోటలో ఉండే ఆమెకు సంబంధించిన ఫొటోను తీయడం ద్వారా డాక్యుమెంటేషన్ ప్రారంభమైంది. ఇప్పటివరకూ 400 మందికిపైగా మహిళల ఫొటోలు, వివరాలు సేకరించాను. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళలపై డాక్యుమెంటేషన్ సాగుతోంది. ప్రస్తుతం ఉత్తర భారత్‌లోని పలు రాష్ట్రాల మహిళలను కెమెరాలో బంధించే పనిలో ఉన్నాను. ఇప్పటివరకు సంప్రతించినవారిలో రోజు కూలీలు, గిరిజన మహిళలు, సామాజిక కార్యకర్తలు, కార్మికులు ఉన్నారు. అన్నీ కలిపి 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాను. కొన్ని వీడియోలు కూడా చిత్రీకరిస్తున్నాను. ప్రతి మహిళ వెనుక ఒక విజయ గాథ ఉంటుంది. దాన్ని ఈ ప్రపంచానికి చెప్పడమే నా ఉద్దేశం. పది లక్షలమంది మహిళలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ అంటే సాధారణ విషయం కాదు. ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. అందుకు సిద్ధమయ్యే ఈ అద్భుత ప్రాజెక్టును చేపట్టాను."

- బూటు శ్రీనివాసరావు, విశాఖపట్నం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	129
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 470

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 9018
వెండి కిలో ధర	రూ. 96,100
వెండి ఒక గ్రాము	రూ. 99.10

బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవు : ఎంపీడీవో

లింగసముద్రం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ కె శ్రీనివాసులు సిబ్బందిని హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలోని ఆర్‌ఆర్ పాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, టిఏ మహేంద్ర, ఎఫ్ఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

260 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 343పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11కంపెనీల ప్రతినిధులు పాల్గొని 260బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-56, ఆర్‌ఆర్-9, సీఆర్-18 కారణాలతో 83బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.254.97గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి ఇసాక్ స్వరన్‌దత్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

- మంత్రి సత్యకుమార్‌కి బీజేపీ నేతల వినతి

కలిగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఆరోగ్య కుటుంబసంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ స్టేట్ కౌన్సిలర్ నందనవనం ప్రభాకర రావు స్థానిక నేతలతో కలిసి శనివారం వినతిపత్రాలు అందజేశారు. వింజమూరులో డయాలసిస్ కేంద్ర ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రిని కలిసి కలిగిరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని అసౌకర్యాలను వివరించారు. వారి వెంట మండల కూటమి నాయకులు ఉన్నారు.

ఆలయ పునఃప్రతిష్ఠకు ఆహ్వానం

కావలి, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ పునఃప్రతిష్ఠ ఈ నెల 18న శృంగేరి పీఠాధిపతుల చేతుల మీదుగా జరుగనుందని ఆలయ కమిటీ కోశాధికారి రోశయ్య, ఉపకోశాధికారి అమరా వేదగిరిలు తెలిపారు. ఈ విషయంపై శనివారం వారు పట్టణంలోని పలువురికి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఆలయ నిర్మాణానికి నగదు రూపేణా.. వస్తు రూపేణా ఆర్థికసహాయం అందచేసిన వారికి తొలుత ఇంటింటికి వెళ్లి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

వైభవంగా కలశ మహోత్సవం

లింగసముద్రం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్ల గ్రామంలో దత్తాత్రేయస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా శనివారం కలశ మహోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం దత్తాత్రేయస్వామి మాలధారణ చేసిన స్వాములు గ్రామంలోని కోదండరామస్వామి ఆలయం వద్ద కలశాలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని టాక్టర్‌లో గ్రామంలో ఊరేగించారు. గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్సైలు ఎం నారాయణ, వెంకట్రావు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కోన బ్రహ్మోత్సవ కమిటీ సభ్యుడిగా కిన్నెర



కిన్నెర నరసింహరావును అభినందిస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ సభ్యునిగా ఆత్మకూరు పట్టణానికి చెందిన కిన్నెర నరసింహారావు నియమితులయ్యారు. కాగా, బ్రహ్మోత్సవ కమిటీ సభ్యునిగా ఎంపికచేసిన రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, సహకరించిన పట్టణ టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, జిల్లా తెలుగు యువత నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సిద్దీపురంలో మెగా రక్తదాన శిబిరం

సంగం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దీపురంలో యువనేస్తం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన యువనేస్తం సేవా ఫౌండేషన్ సభ్యులు ఏటా మే నెలలో రక్తదాన శిబిరం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

అనంతసాగరం, మే 3 (ఆంధ్రజ్యోతి): సోమశిల గిరిజన గురు కుల బాలుర పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 9441852191 నెంబరును సంప్రదించాలని కోరారు.

మాలకొండలో భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి

- ఎమ్మెల్యే నాగేశ్వరరావు



మాలకొండలో దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. శనివారం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాగణంలోని మహా అన్నదానం, కేశ ఖండన శాల, లడ్డుప్రసాదం కౌంటర్, దుకాణాలు, కోనేరు తదితర ప్రాంతాలను పరిశీలించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని భక్తులకు తాగునీరు, ఇతర వసతులు కల్పించాలని ఆలయ అధికారులకు ఆయన సూచించారు. ఆలయంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. భక్తులకు నాణ్యమైన లడు ప్రసాదం, రుచి శుచికరమైన భోజనం అందించాలని తెలిపారు. దాతలను ప్రోత్సహించి ఆలయంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ఆధ్యాత్మిక శోభ సంతరించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఈ నెల 17వ తేదీన జరగనున్న లక్ష్మీనరసింహస్వామి జయంతి గోడపత్రికను ఆవిష్కరించారు. ఎమ్మెల్యేను పలువురు భక్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవి సాగర్‌బాబు, కందుకూరు రూరల్ ఎస్ఐ బాలమహేంద్ర నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు మన్నం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దశదినకర్మకు ఎమ్మెల్యే హాజరు

మండలంలోని శాఖవరంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన వడ్లమూడి వరమ్మ దశదిన ఖర్మకు ఎమ్మెల్యే ఇంటూరి హాజరై ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకట్రావు, కందుకూరు పట్టణ టిడిపి మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని శాఖవరంలో గ్రామ సచివాలయాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, మూమెంట్ రిజిస్టరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు.

ఫిజియోథెరపీపై అవగాహన

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీతో మానసిక వత్తిళ్లు దూరం అవుతాయని డాక్టర్ రమేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నరేంద్రదేవ్ అధ్యక్షతన ఫిజియోథెరపీపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

రామదూత ఆశ్రమ భూములను స్వాధీనం చేసుకోవాలి

- హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె

కందుకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం చేవూరు వద్ద జాతీయ రహదారికి పక్కనే చెరువుపోరంబోకు భూమి, అటవీ భూములలో రామదూత స్వామి నిర్మించిన ఆశ్రమంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేసి తక్షణం భూములను స్వాధీనం చేసుకోవాలని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవాలని, అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని నాలుగేళ్లక్రితం ప్రిన్సిపల్ సెక్రటరీ ఉషారాణి ఆదేశాలు జారీచేయగా ఆ ఉత్తర్వులను అమలుచేయకపోగా ఉన్నతాధికారులను తప్పుదారిపట్టించేలా కిందిస్థాయి అధికారులు నివేదికలు ఇస్తుండటం శోచనీయమన్నారు. తక్షణం ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు అమలు చేయాలని కోరుతూ శనివారం సబ్ కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఆక్రమణల తొలగింపుపై స్టేకి వెళ్లలేదు : మాదాల

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరు సర్కిల్ అభివృద్ధి కోసం చేపట్టిన ఆక్రమణల తొలగింపును సవాల్‌చేస్తూ కోర్టులో స్టేకోసం తాను వెళ్లలేదని స్థానికుడైన మాదాల రవీంద్ర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేరే వ్యక్తులు కోర్టుకు వెళ్లి స్టేతెచ్చారని, కొందరు కావాలని తనపేరును జతచేశారని, తనకు, స్టే ఉత్తర్వులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. నిబంధనల మేరకు సర్కిల్ అభివృద్ధికి అధికారులకు సహకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు.

వింజమూరులో డయాలసిస్ కేంద్రం ప్రారంభం



వింజమూరులో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో డయాలసిస్ కేంద్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి మాట పక్కన పెడితే, ప్రజల ప్రాణాలను మాత్రం జగన్మోహన్‌రెడ్డి హరించారని దుయ్యబట్టారు. జగన్ అమ్మిన మద్యం తాగి కిడ్నీ వ్యాధిగ్రస్థులు పెరిగారని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా క్యాన్సర్ బాధితులు కూడా పెరుగుతున్నారని, వారిని మొదటి దశలోనే గుర్తించడానికి ఇప్పటికే మూడు కోట్ల మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. అనంతరం మంత్రిని, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, వంటేరు వేణుగోపాల్ రెడ్డి, కొమ్మి లక్ష్మణ్‌నాయుడు, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో సుజాత, సర్పంచి సృజన, ఎంపీపీ ఈ మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు వినతి

కావలి : స్థానిక ఏరియా వైద్యశాలలో డయాలసిస్ సెంటర్, ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని పలువురు పట్టణవాసులు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. శుక్రవారం రాత్రి ఆయన కావలికి చేరుకోగా, బీజేపీ నేతలు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక పోలీస్ కమాండ్ కంట్రోల్ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకున్నారు. శనివారం ఉదయాన్నే ఆయన బీజేపీ నేతలతో కలిసి ట్రంకురోడ్డులో టీ తాగారు. స్థానికులతో కొంతసేపు మాట్లాడారు. అనంతరం వింజమూరుకి బయలుదేరారు. ఆ సమయంలో డీఎంహెచ్‌వో సుజాత, డీసీహెచ్‌వో మునిక్రిష్ణ, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ పద్మావతి, ఆర్ఎంవో ప్రమీల తదితర మంత్రికి పుష్పగుచ్ఛం అందచేసి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కావలి వాసవీ మాత ఆలయ కమిటీ వారు మంత్రిని కలిసి ఆలయ పునరుద్ధరణ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీ. వంశీధర్‌రెడ్డి, నేతలు కందుకూరి వెంకటసత్యనారాయణ, జీ భరత్‌కుమార్, కంచర్ల మురళీధర్ నాయుడు, సీవీసీ సత్యం, కే. బ్రహ్మానందం, మందా కిరణ్‌కుమార్, అమరా వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ ఫీజు గడువు పొడిగింపు

కొండాపురం, మే3(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫీజు దరఖాస్తు గడువు ఈ నెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీహరి శనివారం ఒక ప్రకట నలో తెలిపారు. ఫీజు చెల్లింపునకు ఏప్రిల్ 30తో గడువు ముగిసినా కొందరు విద్యార్థులు చెల్లించ లేదన్న సమాచారంతో ప్రభు త్వం ఫీజు చెల్లింపు నకు గడువు పొడిగించింద న్నారు. ప్రథమ సంవత్సరం (ఆర్ట్స్, సైన్స్) విద్యార్థులు రూ.600, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆర్ట్స్ విద్యార్థులు రూ.600, సైన్స్ విద్యార్థులు రూ.875 ఆన్‌లైన్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

మాలకొండ ఆదాయం రూ. 11,79,689

వలేటివారిపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 11,79,689 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవి సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 6 వేలు, కుంకుమార్చన ద్వారా రూ. 20,840, వివాహముల ద్వారా రూ. 6 వేలు, తలనీలాలు ద్వారా రూ. 72,375, వాహన పూజలు ద్వారా రూ. 3,040, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 4,35,200, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 680, రూంఅద్దెలు ద్వారా రూ. 35,330, కవర్లు ద్వారా రూ. 8,700, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,47,390, అన్నదానం ద్వారా రూ. 3,30,518, విరాళముల ద్వారా రూ. 13,616 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు తెలియజేశారు.

బాలబాలికల బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో శనివారం జరిగింది. క్రీడా కారులను జిల్లా జట్లకు ఎంపికచేసినట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ తొట్టెంపూడి సుబ్బారావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు పామూరులోని సెయింట్ మార్క్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తామని, మే 15నుంచి 18వరకు చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమంలో ముప్పవరపు జయకుమార్, సయ్యద్ జిలానీబాషా, ఇతర పీడీలు పాల్గొన్నారు.

ఇండోసోల్‌కు వేల ఎకరాలు కట్టబెట్టాలనుకోవటం శోచనీయం

- ఆమ్ ఆద్మీ పార్టీ నేత నేతి మహేశ్వరరావు

కందుకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్ కోసం ఉలవపాడు మండలం కరేడులో వేల ఎకరాలు కట్టబెట్టాలని ప్రభుత్వం యోచిస్తుండటం శోచనీయమని ఆమ్ ఆద్మీ పార్టీ జోనల్ కోఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కరేడులో ఎంతో విలువైన రెండు పంటలు పండే భూములు, పండ్లతోటలు, ఆకుతోటలు ఉన్నాయని, అలాంటిచోట ఇండోసోల్‌కు భూకేటాయింపులకు ప్రభుత్వం జీఓ ఇవ్వటం ఆక్షేపణీయమన్నారు. తక్షణం ఈ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజరు బదిలీ



మేనేజరును సత్కరిస్తున్న సిబ్బంది

అల్లూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజరు టి.దర్శన్‌కుమార్‌ను శనివారం బదిలీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. అల్లూరులో శాఖ ఏర్పాటైన నాటినుంచి నేటి వరకు ఆయన విధులు నిర్వహించి అల్లూరు శాఖ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని బ్యాంకు సిబ్బంది కొనియాడారు. కార్యక్రమంలో క్యాషియర్ సుజాత, డిప్యూటీ మేనేజరు ఆంజనేయులు, సిబ్బంది కమల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి సహకరించాలి

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ నేతల వినతి

ఆత్మకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, జిల్లా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కటరంపాటి సుధాకర్ కోరారు. శనివారం మంత్రి సత్యకుమార్ వింజమూరు పర్యటన సందర్భంగా వారు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయరెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులు వివరించి, అందుకు తమవంతు సహకారం అందించాలని కోరారు. అదేక్రమంలో ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలను 150 పడకల వైద్యశాలగా తీర్చిదిద్దాలని కోరారు. వైద్యుల కొరత ఉందని వివరించారు. అందుకు మంత్రి సత్యకుమార్ సానుకూలంగా స్పందించారు. ఆనం రామనారాయణరెడ్డి ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నారని వైద్యశాలను తప్పక అభివృద్ధి చేసి తీరుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పొన్నూరు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిని జిల్లా చేయాలి

ఉదయగిరి: ఉదయగిరిని జిల్లా కేంద్రంగా చేసి అభివృద్ధి చేయాలని శనివారం వింజమూరుకు విచ్చేసిన రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తోపాటు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లకు టీడీపీ, బీజేపీ నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షులు సందిరెడ్డి రామారావు, సురేష్‌రెడ్డిలు వినతిపత్రం అందజేశారు. అలాగే నియోజకవర్గంలో న్యాయవాదులకు ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయాలని కోరినట్లు వారు తెలిపారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేను సన్మానించారు.

ఉదయం ఉలుకూపలుకూ లేకుండా..

- సాయంత్రం పాడె ఎక్కించేటపుడు స్పృహలోకి..
- నీరు, పాలు తాగించడంతో కాసేపటికే మృతి
- కొండయ్యగారిపాలెంలో ఘటన



శేషమ్మ (ఫైల్)

కావలి రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండయ్యగారిపాలెంకు చెందిన ఉప్పాల శేషమ్మ (70) అంత్యక్రియల్లో వింత అనుభవం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువుల కథనం మేరకు వివరాలు... శేషమ్మ మూడునెలల కిందట అల్లూరు మండలం రామన్నపాలెంలో ఉంటున్న చెల్లెలు వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో శనివారం ఉదయం ఉలుకూపలుకూ లేకుండా అపస్మారక స్థితిలోకి వెళ్లింది.దీంతో ఆమె మృతి చెందిందని చెల్లెలి కుటుంబసభ్యులు భావించి ఆమెను అంబులెన్స్‌లో కొండయ్యగారిపాలెంలోని కుమారుడు వెంకటేశ్వర్లు ఇంటికి ఉదయం 11గంటలకు తీసుకొచ్చారు. సాయంత్రం 4గంటల వరకు చాపపై పడుకోబెట్టారు. అంత్యక్రియల కోసమని వివిధ గ్రామాల నుంచి బంధువులను పిలిపించడంతో వారు ఏడుపులతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాణసంచా కాల్చి పాడె ఎక్కించే సమయంలో ఆమెలో కదలికలు కనిపించడంతో అక్కడున్నవారంతా ఒకింత విస్మయానికి గురయ్యారు. బంధువులంతా ఆమెకు తిరిగి ప్రాణమొచ్చిందని ఆనందపడ్డారు. కొంతసేపు కూర్చోబెట్టి మంచి నీళ్లు, పాలు తాపించి కావలికి తీసుకొచ్చేందుకు 108 వాహనాన్ని పిలిచారు. వారు వచ్చి ఆమె పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మళ్లీ విషాదంలో మునిగిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చేసేదిలేక మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



అనంతసాగరం: ప్రత్యేక అలంకారంలో సీతారామ లక్ష్మణస్వామి

అనంతసాగరం మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవనగరంలో ఉన్న కోదండ రాముని ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఘనంగా ఊరేగించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా వసంతోత్సవం

ఉదయగిరి: మండలంలోని జీ.చెర్లోపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలు శనివారం వైభవంగా ముగిసాయి. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం వసంతోత్సవం, పారువేట నిర్వహించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖుల రాక

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న అంకాళమ్మతల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక ఉత్సవాలకు ఆదివారం దేవదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ శాసన సభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అలాగే గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వాటర్‌ప్లాంటును ప్రారంభించడంతోపాటు ధర్మవరం గ్రామంలో పర్యటిస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

వ్యర్థాల నిర్వహణలో భాగస్వాములు కావాలి

సీతారామపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డిప్యూటీ ఎంపీడీవో భార్గవి సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్తున్నారా, లేదా అని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా భార్గవి మాట్లాడుతూ ఇంటిలోని తడిచెత్త, పొడిచెత్త గ్రీన్ అంబాసిడర్‌లకు అందచేయాలన్నారు.

సచివాలయానికి వాటర్ కూలర్ వితరణ

సంగం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి సచివాలయానికి పడమటిపాళెం నీటిసంఘం ఉపాధ్యక్షుడు మర్రి సందీప్ యాదవ్ వాటర్ కూలర్‌ను శనివారం బహూకరించారు. సచివాలయానికి వచ్చే ప్రజలతోపాటు సిబ్బందికి చల్లటి తాగునీటి కోసం తన సొంత నిధులు వెచ్చించి అందచేశారు.

ధ్యానంపై విద్యార్థులకు శిక్షణ



ధ్యానంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న మురళి

అనంతసాగరం మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం విద్యార్థు లకు ధ్యానంపై సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ బీ మురళి శిక్షణ ఇచ్చారు. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతిరోజు మెడిటేషన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు నారాయణరావు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

అనంతసాగరం మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని శనివారం డీఎల్‌పీవో నయీమ్‌తాజ్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రతేక శ్రద్ధ చూపాలని, తాగునీరు, పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగృహాల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలి



కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఈ గౌస్‌మొహిద్దీన్

సంగం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మక్తాపురంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న పక్కాగృహ నిర్మాణాలను గృహనిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ గౌస్‌మొహిద్దీన్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు నిర్మాణాలు చేపడితే అవసరమైన సిమెంట్, ఇనుము సరఫరా చేస్తున్నామన్నారు. అంతేగాకుండా బిల్లులు కూడా వెంటనే మంజూరవుతున్నాయన్నారు. పనులు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వర్క్‌ఇన్‌స్పెక్టర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పుట్టిన ప్రతి బిడ్డకు ఆధార్ కార్డు తప్పనిసరి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో భార్గవి

సీతారామపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ప్రతి బిడ్డకు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో భార్గవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన శనివారం మహిళా పోలీసులకు, అంగన్వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పుట్టిన ప్రతి బిడ్డకు ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయిం చిందని, ఇందులో భాగంగా మండల పరిధిలో పుట్టిన పిల్లలకు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఉందా, లేదా అనే వివరాలు తెలుసుకొని యాప్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు.

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

మర్రిపాడు, మే 3 (ఆంధ్రజ్యోతి): పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ వెంకటేశ్వర్లురెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	129
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
కోడిగుడ్ల ధర (425):	

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9018
వెండి కిలో ధర	రూ.96,100
వెండి ఒక గ్రాము	రూ.99.10

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), మే 3(ఆంధ్రజ్యోతి): వాత్సల్య శరణాలయ ప్రాంగణంలో ఈనెల 5 నుంచి జూన్ 5వ తేదీ వరకు ఉచిత వేసవి యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని జనహిత వాత్సల్య అనాథ శరణాలయం ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబ శివరావు ఒక ప్రకటనలో తెలిపారు. యోగా గురువు ముప్పిరాల నరసింహశాస్త్రిచే ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు ఈ యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదో తరగతి ఆ పైస్థాయి చదువుతున్న బాలబాలికలు ఈ ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

సేవాభావంతో పనిచేస్తే చేయూత

● రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్

నెల్లూరు(వైద్యం), మే 3(ఆంధ్రజ్యోతి): లాభాపేక్ష లేకుండా సేవాభావంతో పనిచేసే ప్రైవేట్ వైద్య సంస్థలకు ప్రభుత్వం చేయూతనం దిస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్ వెల్లడించారు. శనివారం నగరంలోని జయభారత్ ఆసుపత్రిలో చిన్నపిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నవజాత శిశు సంరక్షణకు ఈ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, సింహపురి సేవాసమితి నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

అల్లీపురం పీహెచ్‌సీ తనిఖీ

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పరిశీలించారు. ఇక్కడ ప్రహరీ నిర్మాణానికి రూ.1.30 కోట్ల అంచనాలతో అధికారులు ప్రతిపాదించగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ఎంపీ నిధులు రూ.30 లక్షలు ఇస్తామని వెల్లడించారు. అనంతరం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసంలో జరిగిన విందులో సోమిరెడ్డి శాలువా, పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలభిషేకం

నెల్లూరు(హరనాథపురం): కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించడంతో ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు మద్దులూరి సుభాష్‌యాదవ్ ఆధ్వర్యంలో నగరంలోని రాంజీ నగర్ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వచ్చే జనగణనలో కులగణన చేయాలని నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమైన నిర్ణయమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.నరేష్, జిల్లా అధ్యక్షుడు సమాధి శ్రీనివాసులు, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాషన్‌బాబు, కంచర్ల హరీష్, కొడవలూరు రమేష్, చిలకపాటి శ్రవణ్, రాచూరు మురళీ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన జనసేన నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగరానికి వచ్చిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను జనసేన నేత నూనె మల్లికార్జున యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట పలువురు జనసైనికులు ఉన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేస్తా

● రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇన్‌చార్జి సురేంద్రరెడ్డి

నెల్లూరురూరల్, మే 3(ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్ మండలంలో టీడీపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేంద్రరెడ్డి తెలిపారు. నూతనంగా నియమితులైన ఆయన శనివారం కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిలకు పుష్పగుచ్ఛం అందచేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటంరెడ్డి సోదరులు తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా విధేయుడిగా ఉంటానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు, ప్రజలను సమన్వయం చేసుకుని ఎక్కడికక్కడ లోటుపాట్లను సరిచేసుకుంటూ వెళ్తానన్నారు. ప్రజలకు అండగా నిలిచి ఎమ్మెల్యే కార్యాలయం వారధిగా పని చేస్తానని తెలిపారు. కోటంరెడ్డి బ్రదర్స్‌ను నమ్ముకుని ఉన్న ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఇచ్చారని, అందులో తాను ఒకడినన్నారు. గతంలో వేదగిరి క్షేత్రం చైర్మన్‌గా తనకు జిల్లా స్థాయి గుర్తింపు ఇచ్చి గౌరవించారని పేర్కొన్నారు.



ఎమ్మెల్యే కోటంరెడ్డికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న సురేంద్రరెడ్డి

● అనుబంధ కమిటీల నియామకం

మండలానికి చెందిన పార్టీ అనుబంధ సంఘ పదవులు కొన్నింటిని శనివారం ఖరారు చేస్తు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ నెల్లూరు రూరల్ మండల అధ్యక్షుడిగా పముజు ప్రదీప్, బీసీ సెల్ అధ్యక్షుడిగా ధనలక్ష్మీపురంకు చెందిన కుంచాల విజయభాస్కర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కల్లూరిపల్లికి చెం దిన అరవ శ్రీను, తెలుగు యువత అధ్యక్షుడిగా నందిపాటి శ్యాం, మహిళా విభాగం అధ్యక్షురాలిగా తోట శోభారాణి, ప్రధాన కార్యదర్శిగా పట్నం అరుణమ్మ, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా అస్లాం, ఎస్టీసెల్ అధ్యక్షుడిగా పాల కీర్త శ్రీనివాసులు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా బిల్లుపాటి రవిని నియమించారు.

● సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలోని 11 మంది బాధితులకు రూ.12 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఎమ్మెల్యే కార్యాలయంలో అందచేశారు. ఆయన మాట్లాడుతూ పేద, నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. మెరుగైన వైద్యం చేయించుకోలేని ఎందరో బాధితులు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక లబ్ధిపొందుతున్నారని పేర్కొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించను

● ఎన్ఎంసీ కమిషనర్ నందన్ ● శానిటేషన్ సెక్రటరీలకు చార్జి మెమోల జారీ

నెల్లూరు(సిటీ), మే 3(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఎన్ఎంసీ కమిషనర్ వైఓ నందన్ హెచ్చరించారు. శనివారం నగరంలోని 6వ డివిజన్ శెట్టిగుంటరోడ్డు, అరుందతిపాళెంతో పాటు పలు ప్రాంతా ల్లో ఆయన పర్యటించి పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో శానిటేషన్‌కు చెందిన సెక్రటరీలు నిర్లక్ష్యంగా వ్యవహరించారని గుర్తించారు. అందుకు బాధ్యులైన కొంద రు శానిటేషన్ సెక్రటరీలకు చార్జి మెమోలు జా రీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జనావాసాల మధ్య పశువుల కొట్టాలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిని తొలగించి బయట ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ మేరకు వారికి నోటీసులు జారీ చేశారు. రోడ్ల పైన తరుచూ చెత్త వేసేవారిని గుర్తించి వారికి జరిమానాలు విధించాలని ఆదేశించారు. అలాగే ఎంహెచ్‌వో చైతన్య 12, 17, 19, 51 డివిజన్లలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు.



మస్టర్ పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

వేసవిలో దాహార్తి సమస్య రానివ్వద్దు

వేసవి తాపం పెరిగినందున నగరంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానివ్వకుండా చూసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రజలకు దాహార్తి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. చేతి పంపులన్నీ మరమ్మతులు చేయించాలని, వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించి పూర్తి కెపాసిటీతో నింపాలన్నారు. అవసరమైన స్పేర్‌స్పాట్లు అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం సచివాలయ శానిటేషన్ సెక్రటరీలతో నిర్వహించిన సమీక్షలో పాల్గొని మాట్లాడుతూ నివాసాల వద్ద డ్రైనేజీ కాలువల్లో పూడిక తీయ్యాలని ఆదేశించారు. కాలువల పై నిర్మించిన ఆక్రమణలు, ర్యాంపులు, మెట్లును తొలగించి శుభ్రం చేయాలన్నారు. కొత్తగా జీఐఎస్ ఆధారితతో తయారు చేసిన మాస్టర్ ప్లాన్ అందుబాటులోకి వచ్చిందని, దానిని ఫ్లెక్సీ ద్వారా డిస్ప్లే చేసి కార్పొరేషన్ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని, ప్రజలు చూసుకోవచ్చని తెలిపారు.

న్యాయశాఖ ఉద్యోగుల భవనం ప్రారంభం

నెల్లూరు(లీగల్), మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల భవనాన్ని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయశాఖ ఉద్యోగుల సమస్యలను జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.సురేష్, పీవీ.నారాయణరెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ త్వరలోనే లిఫ్ట్‌ను బాగుచేసి న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయశాఖ ఉద్యోగులు పడుతున్న బాధలను తొలగిస్తానని, ఆర్థికపరమైన సమస్యలను కూడా పరిష్కరిస్తానని, తన పరిధిలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిపాలనాధికారి నాగరాణి, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు కె.వెంకట సునీల్, ఎంవీ.శివకుమార్, కె.దీపక్, వీ.వెంకటేశ్వర్లు, సీహెచ్, పోలయ్య పాల్గొన్నారు.



ఉద్యోగుల భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

ఎంపీ మస్తాన్‌రావుతో 'ఎస్' నేతల భేటీ

నెల్లూరురూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుతో యాదవ ఎంప్లాయీస్ సొసైటీ (ఎస్) నేతలు భేటీ అయ్యారు. నూతనంగా ఏర్పడిన సొసైటీ పాలక మండలి, నాయకులు శనివారం నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సొసైటీ ద్వారా యాదవ కుటుంబాలలోని విద్యార్థులకు ఆర్థిక సహాయం, వారిలో చైతన్యం, అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నట్లు సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్ర, శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు సొసైటీని బలోపేతం చేసి క్షేత్రస్థాయిలో విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయనను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు డీ.వెంకటేశ్వర్లు, నాయకులు మురళి, ఉడత వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ మస్తాన్‌రావును సన్మానిస్తున్న నాయకులు

ముగిసిన తిరునక్షత్రం ఉత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), మే 3(ఆంధ్రజ్యోతి) : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో శ్రీమద్‌భగవద్రామానుజాచార్యులు 1008 జన్మ తిరునక్షత్రం ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిత్య తిరువారాధన రామానుజ, అష్టోత్తరము, తిరువాయి మొళి సేవ, మహానివేదన, కర్పూర నీరాజనములు జరిగాయి. అనంతరం శాత్తుమురై తీర్థ ప్రసాద ఘట్టములు చేపట్టారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు సిబ్బంది పర్యవేక్షించారు.

ఎన్‌సీసీ శిబిరంతో అద్భుత అనుభవం

● లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదంగవే

వెంకటాచలం, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితంలో ఎన్‌సీసీ శిబిరంతో అద్భుత అనుభవం ఇస్తుందని ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదంగవే తెలిపారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతీనగర్ లోని అక్షర విద్యాలయంలో ఆరురోజులుగా జరుగుతున్న ఎన్‌సీసీ శిబిరంలో శనివారం పలు విషయాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బోట్‌వర్క్, కమ్యూనికేషన్, లీడర్షిప్, పేరెడ్, ఆ యుధ, సోషల్ అవేర్నెస్, నేషనల్ ఇంటిగ్రేషన్ వంటి పలు విషయాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అలాగే అగ్నిమాపక ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడాలి, నివారణ చర్యలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించి మాట్లాడారు. మాతృభూమి సేవలో తరించే సైనికులను ప్రతి ఎన్‌సీసీ విద్యార్థి ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలన్నారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందికి ఎన్‌సీసీ తరపున జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు గుండాల నరేంద్రబాబు, మల్లికార్జున్‌రెడ్డి, మస్తానయ్య, కొండారెడ్డి, విద్యాసాగర్, అరోరా, సాయిశంకరి, దివ్య, అగ్ని మాపక సిబ్బంది రాజేంద్ర ప్రసాద్, షేక్ ఇలి యాజ్, వెంకయ్య, రియాజ్ ఉన్నారు.



ప్రమాదాలపై నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు విస్తరణ పనులు

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, మే 3(ఆంధ్రజ్యోతి):వచ్చేనెల మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభో త్సవంలోగా ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు విస్తరణ పనులు చేపడతామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఎమ్మెల్యే బుచ్చిలో 68దుకాణాలతో నిర్మిస్తున్న పట్టణ మార్కెట్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం రోడ్డు విస్తరణ, ఆక్ర మణల తొలగింపు పనులపై ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు బత్తల హరికృష్ణ, నూరా శ్రీనివాసులు రెడ్డి, మోర్ల మురళి, కోడూరు కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బుచ్చిలో మార్కెట్ నిర్మాణం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఇటుక బట్టీల నిర్వహణకు అనుమతి తూచ్..

● కన్నెత్తి చూడని అధికారులు

ఇందుకూరు పేట, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపాడు జగదేవిపేటలో పంచాయతీ అనుమతులు లేకుండా పంట పొలాల్లో షెడ్ల ఏర్పాటు, ఇటుక బట్టీల నిర్మాణం చేపట్టి నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నట్లు వాహనదారులు, గ్రామ ప్రజలు చెబుతున్నారు. వీటి ఏర్పాటుతో వాతావరణ కాలుష్యం దెబ్బ తినడంతో పాటు పక్క పంట పొలాల్లో బూడిద పడి పంట దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబం దిత అధికారులు స్పందించి ఇటుక బట్టి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పల్లిపాడులో పొలాల మధ్య ఏర్పాటు చేసిన ఇసుక బట్టీలు

ఉదయం ఉలుకూపలుకూ లేకుండా..

● సాయంత్రం పాడె ఎక్కించేటపుడు స్పృహలోకి..

● నీరు తాగించడంతో కాసేపటికే మృతి

కావలి రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): కొండయ్యగారిపాలెంకు చెందిన ఉప్పాల శేషమ్మ (70) అంత్యక్రియల్లో వింత అనుభవం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువుల కథనం మేరకు.. శేషమ్మ 3నెలల కిందట అల్లూరు మండలం రామన్నపాలెంలోని చెల్లెలు వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో శనివారం ఉదయం ఉలుకూపలుకూ లేకుండా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమె మృతి చెందిందని చెల్లెలి కుటుంబసభ్యులు భావించి అంబులెన్స్‌లో కొండయ్యగారిపాలెంలోని కుమారుడు వెంకటేశ్వర్లు ఇంటికి ఉదయం 11 గంటలకు తీసుకొచ్చారు. సాయంత్రం 4గంటల వరకు చాపపై పడుకోబెట్టారు. అంత్యక్రియల కోసమని బంధువులను పిలిపించారు. బాణసంచా కాల్చి పాడె ఎక్కించే సమయంలో ఆమెలో కదలికలు రావడంతో అక్కడున్నవారంతా ఒకింత విస్మయం చెందారు. తిరిగి ప్రాణమొచ్చిందని ఆనందపడ్డారు. కొంతసేపు కూర్చొబెట్టి మంచి నీళ్లు, పాలు తాపించి కావలికి తీసుకొచ్చేందుకు 108 వాహనాన్ని పిలిచారు. వారు వచ్చి ఆమె పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మళ్లీ విషాదంలో మునిగిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చేసేదిలేక మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

సినిమాలకు చిన్న పిల్లలకు అనుమతి లేదు

● నెల్లూరు ఆర్డీవో అనూష

నెల్లూరు (వెంకటేశ్వరపురం),మే 3 (ఆంధ్రజ్యోతి): ఏ రేటింగ్, ఏ క్యాటగిరీ (అసభ్యత, వైలెన్స్) ఉన్న సినిమాలకు 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు అనుమతి లేదని నెల్లూరు ఆర్డీవో అనూష హెచ్చరించారు. శనివారం నగరంలోని పలు సినిమా హాల్స్‌ను ఆమె తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అసభ్యకర సన్నివేశాలు, వైలెన్స్ ఎక్కువగా ఉన్న సినిమాలకు పిల్లలను అనుమతించరాదని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను సినిమా హాళ్ల నిర్వాహకులు పాటించాలన్నారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా ఎవరైన ఈ మార్గదర్శకాలు పాటించక పోతే వారిని కఠనంగా శిక్షిస్తామని, వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆర్డీవోతో పాటు నెల్లూరు అర్బన్ తహసీల్దారు షఫీమాలిక్ తదితరులలు పాల్గొన్నారు.

దళిత రైతుల కల సాకారం

విడవలూరు, మే 3(ఆంధ్రజ్యోతి):స్థానిక పంచాయతీ పరిధిలోని జాన్‌పేట, మన్మధరావు పేట, విడవలూరు దళిత వర్గానికి చెందిన చిన్న, సన్నకారు రైతులు 30ఏళ్లుగా ఎదురు చూస్తున్న సాయి కాలువ పూడికతీత పనులు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో శనివారం వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, మండల పరిశీలకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యవోలు సత్యంరెడ్డి, నాయకులు పొన్నలూరు పురంధర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా ఈ కాలువ దుస్థితిని ఎవరూ పట్టించుకోలేదని ఇన్నాళ్లకు ఎమ్మెల్యే పట్టించుకోవడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పూడికతీత పనులతో 160 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. రెండు పంటలు వేసుకోనే వీలు కలిగిందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

తోటపల్లిగూడూరు, మే 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సిబ్బంది విధులపై నిర్లక్ష్యంగా చేస్తే చర్యలు తప్పవని సీడీపీవో రాజ్యలక్ష్మి అన్నారు. కోడూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డారు. ఇందుకూరుపేట ప్రాజెక్టు పరిధిలో వెంకటాచలం, ముత్తు కూరు మండలాల కింద 246అంగన్‌వాడీ కేంద్రాలున్నట్లు తెలిపారు. కేంద్రాల నిర్వహణ తనిఖీలో భాగంగా పరిశీలనకు వచ్చామన్నారు. గర్భవతులు, బాలింతల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిన్నారుల బరువు,ఎత్తులను 1వ తేదీ నుంచి 10వరకు కొలతలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో సూపర్‌వైజరు పాల్గొన్నారు.

ప్రభుత్వస్థలాలు ఆక్రమిస్తే చర్యలు

మనుబోలు, మే 3(ఆంధ్రజ్యోతి): ఎవరైనా ప్రభుత్వస్థలాలు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య హెచ్చరించారు. చెరుకుమూడి రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.144-ఏలోని ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకుని శనివారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. కొమ్మలపూడికి చెందిన చెందులూరు శ్రీనువాసులు సర్వే నెం.143లోని గ్రామ నత్తం స్థలం ను, 144-ఏలోని తోపు పోరంబోకు స్థలంను ఆక్రమించి రిజిష్టర్ చేయిచేసుకున్నట్లు తెలిపారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు గతంలోనే ఆక్రమిత స్థలంను గుర్తించి హెచ్చరిక బోర్డులు పాతామన్నారు. అయితే ఆ బోర్డులు తొలగించి సదరు వ్యక్తి కోర్టును ఆశ్రయించి స్టేటస్‌కో ఆ ర్డర్ తెచ్చారన్నారు. మరలా కోర్టు పూర్తివివరాలు తీసుకుని స్టేటస్‌కో రద్దు చేస్తూ తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. రెండోసారి 144-ఏలో బోర్డు ఏర్పాటు చేశామన్నారు. బోర్డులను తొలగిస్తే కఠిన ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ. శ్రీకాంత్, విఆర్‌వో గుణశేఖర్ లు పాల్గొన్నారు.

మహిళపై లారీ డ్రైవర్ కత్తితో దాడి

నెల్లూరు(క్రైం), మే 3(ఆంధ్రజ్యోతి): మహిళపై లారీడ్రైవర్ కత్తితో దాడిచేసి గాయపరిచిన ఘటన శనివారం నగరంలోని బుజబుజనెల్లూరు ప్రాంతంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బుజబుజనెల్లూరుకు చెందిన మాబున్నీసా, గౌస్ దంపతులు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. అదే ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ విజయ్ శనివారం పూటుగా మద్యం సేవించిన మత్తులో రోడ్డుపై వెళుతున్న వారిని కత్తితో బెదిరిస్తున్నాడు. అదే సమయంలో మాబున్నీసా పిల్లలను సైతం కత్తితో బెదిరించాడు. భయపడిన వారు జరిగిన విషయాన్ని తల్లికి చెప్పారు. ఆమె తన పిల్లలను ఎందుకు భయపెడుతున్నావని విజయ్‌ను ప్రశ్నించింది. దీంతో ఆవేశంతో ఊగిపోతూ విజయ్ తన వద్దనున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. మూడు చోట్ల బలంగా పొడిచి అక్కడ నుంచి పరారయ్యాడు. గాయపడిన ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న వేదాయపాలెం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

తోటపల్లిగూడూరు, మే 3 (ఆంధ్రజ్యోతి):ఆధార్ లేనివారి కోసం బయోమెట్రిక్ సమీకరణకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేశామని మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విషయంపై శనివారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆధార్ క్యాం పులు నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. వరిగొండ-1, నరుకూరు, వరకవిపూడి, మాచర్లవారిపాలెం, కోడూరు బీట్-2, వెంకన్నపాలెం, పొట్లపూడి, సౌత్‌ఆములూరు సచివాలయాల్లో 5వ తేదీ నుంచి 8 వరకు, చిన్నచెరుకూరు, పేడూరు, తోటపల్లిగూడూరు, ఈదూరు, కోడూరు బీట్-1, ఇసుకపాలెం, చింతోపు సచివాలయాల్లో 12నుంచి 15వరకు సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

ప్రపంచ పత్రికా దినోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), మే 3(ఆంధ్రజ్యోతి) : నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా శనివారం ప్రపంచ పత్రికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసైన్స్ నగర అధ్యక్షుడు ఎం.సతీష్‌కుమార్ మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా, నిస్వార్థంగా, తమ గళంతోనూ, కలంతోనూ ప్రజలను చైతన్యపరిచేవారు పాత్రికేయులు అని తెలిపారు. స్వాతంత్ర్య సమరంలో పత్రికలు, పాత్రికేయులు పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. అనంతరం పుస్తక పఠనంలో మెలకువలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా, ప్రసాద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువల పనులకు అనుమతి ఇవ్వాలి

నెల్లూరు(వెంకటేశ్వరపురం), మే 3 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన అభయారణ్యంలో ఇరిగేషన్ కెనాల్ పనులకు అనుమతులు మంజూరు చేయాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు శనివారం మంగళగిరిలోని అరణ్యభవన్‌కు వెళ్లిన ఆయన అక్కడ అధికారులు లేకపోవడంతో సెక్షన్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ 70 శాతం పనులు జరిగిన రాపూరు కెనాల్‌ను అటవీశాఖ అధికారులు నిలిపివేశారన్నారు. పదివేల మందికి ఉపయోగపడే నీటి కోసం వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. మిడతల రమేష్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

నేడు ఉచిత పుస్తకాల పంపిణీ

నెల్లూరు(సాంస్కృతికం), మే 3(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘాలు, విజ్ఞాన ప్రచురణలు సంయుక్తంగా ఆదివారం సాయంత్రం 4 నుంచి 7గంటల వరకు ఉచిత పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నగరంలోని చిల్డ్రన్స్‌పార్కులో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పుస్తకాలను ప్రజల నుంచి విరాళంగా సేకరించినవని తెలిపారు. చిల్డ్రన్స్ పార్కులో పుస్తకాల ప్రదర్శన ఏర్పాటు చేస్తామని, అందులో నచ్చిన పుస్తకాలను పాఠకులు తీసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే తమ వద్దనున్న పుస్తకాలను ఇవ్వవచ్చునని, ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9440503061, 9441214040, 8639693785 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

లైబ్రరీలో ఆటాపాట

కోవూరు, మే3, (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖగ్రంథాలయంలో శనివారం వేసవివిజ్ఞాన శిబిరం సందర్భంగా విద్యార్థులు ఆటాపాటలతో హోరెత్తించారు. శాఖ గ్రంథాలయం, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి, జనవిజ్ఞాన వేదికనాయకులు భాస్కరరావు, పార్వతీశం, విజయకుమార్,సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

రాపూరు, మే3(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్రీస్కంధ ఆయుర్వేదిక్ మల్టీ స్పెషాలిటీ సహకారంతో డాక్టర్ కడివేటి లోకేష్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహిస్తు న్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరం ఆదివారం ఉదయం 9గంటల నుంచి ఒంటి గంట వరకు జరుగుతుందని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

బుచ్చిరెడ్డిపాళెం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నాగాయగుంటలో హత్యకు గురైన పోలినాయుడు చెరువు గ్రామానికి చెందిన ఎస్‌కే పెద్ద రఫీ కుటుంబాన్ని శనివారం కోవూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పీఏసీ సభ్యులు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట వైసీపీ నాయకులు ఉన్నారు.

మాతృభాషలో న్యాయ మార్గదర్శిని

నెల్లూరు(లీగల్),మే 3(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలకు ఉపయోగకరమైన తను రచించిన మాతృ భాషలో న్యాయదర్శిని, దావా అర్జీలు, పిటీషన్లు నమూనా పుస్తకం విజయవాడ సుప్రీం లా హౌస్‌లో లభ్యమవుతుందని మాజీ నెల్లూరు జిల్లా న్యాయవాది గుమస్తాల సంఘం అధ్యక్షుడు అన్నవరం సత్యనారాయణ ప్రకటనలో తెలిపారు. .

పెన్నానదిలో పడి యువకుడి మృతి

కోవూరు, మే3, (ఆంధ్రజ్యోతి):ఇనమడుగు మజరా జమ్మిపాళెంకు చెందిన బద్దెపూడి చలపతి (25) శనివారం సాయంత్రం సమీపంలోని పెన్నానదిలో ఈత కొట్టేందుకు వెళ్లి ఇసుకలో లోతైన గోతులు ఉండటాన్ని గుర్తించలేక పోయాడు. అందులో చిక్కుకుని మృతి చెందాడు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

1



తిరుపతి
జిల్లా వార్తలు

ఆదివారం 4 మే 2025

జాతరొస్తోంది!



తిరుపతికి జాతర కళ వచ్చేసింది. చాటింపునకు ముందే పుర వీధుల్లో డప్పుల దరువు వినిపిస్తోంది. నగరంలోని మహా శక్తి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. గడిచిన ఐదేళ్లలో కరోనా కారణంగా రెండేళ్లు జాతరకు బ్రేక్ పడింది. మిగిలిన మూడేళ్లు జాతర జరిగిన తీరుపై తిరుపతి స్థానిక ప్రజల్లో విమర్శలు వినిపించాయి. వ్యక్తిగత ప్రాబల్యం పెంచుకునేందుకు జాతర సంప్రదాయాలనే మార్చేశారనే ఆరోపణలు వచ్చాయి. స్థానిక భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా, ఆచార సంప్రదాయాలకు భంగం వాటిల్లకుండా వీఐపీ సారెలు, రాజకీయ వేషాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా జాతరను ఘనంగా నిర్వహించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



పాత గంగమ్మ గుడి

తిరుపతి
ఆంధ్రజ్యోతి

కలర్‌ఫుల్ ఈవెంట్

కాలం మారినా.. నాగరికత పెరిగినా అనాదిగా వస్తున్న గంగజాతర్ల సంప్రదాయాలు మాత్రం సీమ జిల్లాల్లో మారలేదు సరికదా వీటిని అనుసరించి పరవశించేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. తిరుపతి గంగ జాతరలో ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న అధికారులు సైతం వేప మండలు కట్టుకొని, ముఖాన కుంకుమ, తెల్లని, నల్లని చుక్కలు పెట్టుకొని, నెత్తిన సున్నపు కుండలు పెట్టుకొని అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. దేశ, విదేశాల్లో ఉద్యోగ రీత్యా స్థిరపడిన నేటి తరం యువత సైతం గంగజాతర సమయానికి తిరుపతికి చేరుకొని రకరకాల వేషాలు వేస్తుంటారు. ఈ జాతరను ఒక కలర్‌ఫుల్ ఈవెంట్‌గా ఎంజాయ్ చేస్తారు. స్త్రీని శక్తిస్వరూపిణిగా కొలిచే ఈ జాతరలకు సీమ జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లో ఇదే ఆదరణ కనిపిస్తోంది.

13న జాతర

ప్రతి ఏటా చైత్రమాసం చివరివారంలో గంగమ్మ జాతర మహోత్సవాలు వారం రోజులపాటు ఎంతో వైభవంగా జరుగుతాయి. రోజుకోవేషంతో భక్తులు చిత్ర, విచిత్రమైన అలంకారాలతో గంగమ్మను దర్శించుకుంటారు. 7వ తేది బైరాగి వేషంతో మొదలై బండవేషం, తోటివేషం, దొరవేషం, మాతంగివేషం వరకు వేషాల జాతర సాగుతుంది. 12వ తేది సున్నపు కుండలు వేషాలను ఇద్దరు కైకాల కులస్థులు వేస్తారు. వీరు చిన్న గంగమ్మ, పెద్ద గంగమ్మలకు ప్రతీకలుగా భక్తులచేత పూజలందుకుంటారు. 13వ తేది మంగళవారం అసలు జాతర సంబరం మొదలవుతుంది. ప్రత్యేక అభిషేకానంతరం వజ్రకిరీటంలో దర్శనమిచ్చే గంగమ్మను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో పోటెత్తుతారు. విశేషంగా పొంగళ్లు, జంతుబలులు ఉంటాయి. గంగమ్మ ఆలయం ముందు స్థూపానికి బంకమన్నుతో అమ్మవారి విశ్వరూపాన్ని తయారు చేస్తారు. బుధవారం వేకువజామున విశ్వరూప ప్రతిమ చెంప నరకడంతో జాతర పరిసమాప్తి అవుతుంది.

రాత్రి పొద్దు వాలినాకే అవిలాల సారె

పూర్వం అవిలాల చిన్న గ్రామంగా ఉండేది. 1924 నుంచి తిరుపతితో అవిలాలకు బంధం ఏర్పడింది. అవిలాల నుంచి సారెను తాతయ్యగుంట గంగమ్మకు సమర్పించడం ఆచారంగా మారింది. 1992లో సారె ఇచ్చే బాధ్యత నాకు వచ్చింది. అప్పటినుంచి నిరవధికంగా కొనసాగిస్తున్నాం. మంగళవారం మా ఊరి జాతర. అదే రోజున తిరుపతిలో ఉండే తాతయ్యగుంట గంగమ్మ, తాళ్లపాక పెద గంగమ్మ, అంకాళమ్మ, ముత్యాలమ్మ ఆలయాలకు ఊరి తరపున పసుపు కుంకుమ తీసుకునేందుకు రమ్మని ఆదివారం వెళ్లి పిలుస్తా. ఆయా ఆలయాల అధికారులు, ధర్మకర్తలు వచ్చి మమ్మల్ని సారెతో తీసుకుపోతారు. అయితే ముందుటేడాది సాయంత్రం 5 గంటలలోపే తాతయ్యగుంట గంగమ్మకు సారె ఇచ్చేయాలని ఒక నాయకుడు చెప్పారు. పొద్దుపోక ముందే ఇచ్చేయడం బాగుండదని మల్లగుల్లాలు పడ్డాం. అటుఇటుగా ఒక గంట ఆలస్యం చేసి అయిష్టంగానే పంపాల్సివచ్చింది. ఈసారి సాయంత్రం 7.30 గంటలకు పైన రావాలని పిలుస్తాం.

- పెద్దిరెడ్డి, అవిలాల. గంగమ్మ సారె ఇచ్చే ధర్మకర్త

సప్పరాలు పెరగాలి



ఒకప్పుడు జాతర భారీ ఎత్తున జరిగేది. ప్రజలు ఎక్కువగా వచ్చేవారు. చాటింపు వేసిన రోజు నుంచి ఊరు వదిలివెళ్లేవారు కాదు. ప్రజలు స్వచ్ఛందంగా వేషాలు వేసేవారు. అంబలి పోసేవారు. బలులు ఇచ్చేవారు. ఊరంతా వారం రోజులపాటు సందడిగా ఉండేది. బంధుమిత్రులు వచ్చి వారం రోజులపాటు తిరుపతిలో ఉండేవారు. ఆ తర్వాత జాతరలో అనేక మార్పు, చేర్పులతో రాజకీయం ప్రవేశించింది. ప్రచారం కోసం రాజకీయ సారెలు మొదలయ్యాయి. జానపద నేపథ్యం ఉన్న జాతరను క్లాసికల్‌గా మార్చేశారు. జాతరలో ప్రజలు స్వచ్ఛందంగా వేసే పలు వేషాలు కనుమరుగు అయ్యాయి. తిరుపతి గంగమ్మ జాతరలో సప్పరాలు, మాతంగి వేషాలు ప్రత్యేకత. ఒకప్పుడు 250 సప్పరాలు వరకు భక్తులు వేసేవారు. ఒకప్పుడు తిరుమలలో సప్పరం సేవ కూడా ఉండేది. ఇప్పుడు సప్పరాలు, మాతంగి వేషాలు బాగా తగ్గిపోయాయి. వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. తిరుపతిలో 50 డివిజన్లలో ఒక్కో డివిజన్ నుంచి ఒక సప్పరం వచ్చినా పాత ఆచారం పునరుద్ధరించినట్లు అవుతుంది. జాతర నిర్వాహకులు ఆ దిశగా ఆలోచన చేయాలని కోరుతున్నాను.

- పేట శ్రీనివాసుల రెడ్డి, రచయిత, తిరుపతి

తిరుపతిలో మొదలైన సందడి

- వైసీపీ నేతలు పాతరేసిన ఆచారాలు పునరుద్ధరించాలని ప్రజల వేడుకోలు



6న చాటింపు : ప్రతి ఏటా ఏప్రిల్ 15 తర్వాత వచ్చే తొలి మంగళవారంతో జాతర నెల మొదలవుతుంది. తిరుపతి పొలిమేర్లలో 6వ తేది మూడవ మంగళవారం అర్ధరాత్రి వేసే చాటింపుతో గంగజాతర సంబరం మొదలుకానుంది. దీనికి ముందు ఉదయం 7 గంటలకు శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోని విశ్వరూప స్థూపానికి అభిషేకం చేసి వడిబాల కడతారు. సాయంత్రం గంగమ్మ జన్మస్థలమైన అవిలాలనుంచి తాతయ్యగుంట గంగమ్మకు సారె వస్తుంది. ఈసారెతో పాటు స్థానిక కైకాలవాళ్లు నగర పొలిమేర్లలో చాటింపు వేస్తారు.

సారెల ఊరేగింపులకు చెక్

వైసీపీ హయాంలో రెండేళ్లపాటూ సారెల ఊరేగింపులకే పెద్దపీట వేశారు. ప్రతి డివిజన్ నుంచి సారెలు తేవాలని ఆ పార్టీ శ్రేణులతో పాటు అధికార యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చారు. దీంతో సంప్రదాయ జాతర పక్కదారి పట్టింది. సారె వెళ్లే మార్గాల్లో వాహనదారులకు చుక్కలు కనిపించేవి. సారెతో పాటు నాయకులు, అనుచరులు ఆలయంలోకి గుంపులుగా రావడంతో సాధారణ భక్తులు క్యూలైన్లలోనే గంటల తరబడి చిక్కుకుపోవాల్సి వచ్చేది. వీటిని దృష్టిలోపెట్టుకు సారెల ఊరేగింపుల సంప్రదాయానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. అమ్మవారికి సారెలు సమర్పించాలనుకునే గంగమ్మ భక్తులు ఆలయ కార్యాలయంలో ఇచ్చి రసీదు తీసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

నేడు నీట్ యూజీ-2025

- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు పరీక్ష
- హాజరుకానున్న 4,489 మంది విద్యార్థులు

తిరుపతి(విద్య), మే 3(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్ యూజీ-2025) ఆదివారం జరగనుంది. ఎన్టీఏ ఆధ్వర్యంలో జరిగే ఈ పరీక్ష ఏర్పాట్లను డీఆర్వో నరసింహులు పర్యవేక్షిస్తుండగా కేంద్రీయ విద్యాలయం-1 ప్రిన్సిపల్ హేమంత్‌కుమార్ పాండ్య నీట్ సిటీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. 4,489 మంది విద్యార్థులకు తిరుపతిలో 9, గూడూరులో ఒకటి చొప్పున పది పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలవద్ద పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరగనుంది. ఐతే ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు.



జాతీయ రహదారిపై మిలటరీ వాహనాలు

ఆయుధ పరికరాలున్న సైనిక వాహనాలు ఒకదాని వెనుక ఒకటి శనివారం కోల్‌కత్తా- చెన్నై జాతీయ రహదారిపై దూసుకుపోతూ కనిపించాయి. దాదాపుగా 50 వాహనాలు ఇలా వెళ్లడంతో తడ- సూళ్లూరుపేట మధ్య ప్రజలు ఆసక్తిగా చూశారు. పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో యుద్ధవాతావరణం నేపథ్యంలో చెన్నై వైపునకు దూసుకుపోయిన ఈ వాహనాలను చూసి ప్రజలు రకరకాల వ్యాఖ్యానాలు చేశారు.

- తడ, ఆంధ్రజ్యోతి

భగభగ... రారెత్తిస్తున్న ఎండలు

- సూళ్లూరుపేటలో 42.8 డిగ్రీలు నమోదు

తిరుపతి(కలెక్టరేట్), మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు ముదురుతున్నాయి. ఏటా మే చివరి వారం 44 డిగ్రీల వరకు కూడా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ సారి ప్రారంభంలోనే పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 11గంటలకు రోడ్డుమీదకు రావడానికి జనం భయపడుతున్నారు. ఉష్ణోగ్రతలకు తోడు ఉక్కపోత ఉండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సాయంత్రం 5 గంటలైనా బయటకు రావడానికి జంకుతున్నారు. సూళ్లూరుపేట మండలం మంగానెల్లూరులో శనివారం 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు రోజుల్లో 43 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శనివారం నాటి ఉష్ణోగ్రతలు.. సూళ్లూరుపేట 42.8, తిరుపతి అర్బన్, రూరల్ 42.4, వెంకటగిరి 42.2. రేణిగుంట, సత్యవేడు, వరదయ్యపాళెం 41.7, పెళ్లకూరు 41.5, పిచ్చాటూరు 41.2, వడమాలపేట, నారాయణవనం 40.5, తడ 40.4, శ్రీకాళహస్తి, ఏర్పేడు, 40.2 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి.

డీఎస్సీలో క్రీడా కోటా 41 పోస్టులు

- క్రీడాకారులకు 35ఏళ్ల కల సాకారమైందన్న శాప్ చైర్మన్

తిరుపతి(క్రీడలు), మే 3(ఆంధ్రజ్యోతి): 'వివిధ స్థాయిల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించింది. ఇటీవల ప్రకటించిన మెగా డీఎస్సీలో క్రీడాకోటా కింద జిల్లాలో 41 పోస్టులు కేటాయించడం ఇందుకు నిదర్శనం' అని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. తద్వారా క్రీడాకారుల 35ఏళ్ల కల సాకారమైందన్నారు. తిరుపతిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను శాప్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక తొలి ప్రతిపాదనగా దీనిని సీఎం చంద్రబాబు ముందుంచగా, ఆయన అంగీకరించారన్నారు. తద్వారా ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లలో స్పోర్ట్స్ కోటా కింది 3శాతం రిజర్వేషన్ అమలు చేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు.

ఆయన.. ఆమె..

చివరకు ఆయనే!

- ఎస్వీఎంసీ ప్రిన్సిపల్‌గా మళ్లీ రవిప్రభు
- రుయా సూపరింటెండెంట్‌గా రాధ



డాక్టర్ రవిప్రభు



డాక్టర్ రాధ

ఏప్రిల్ 27: తిరుపతిలోని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్‌గా అక్కడి అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ రాధను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఏప్రిల్ 30: ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ రాధ.. రుయా సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవిప్రభునే కొనసాగేలా మళ్లీ ఉత్తర్వులు వచ్చాయి.

మే 1: ఎస్వీఎంసీ ప్రిన్సిపల్‌గా డాక్టర్ రాధ బాధ్యతలు కూడా స్వీకరించారు.

మే 3: ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా రవిప్రభు, రుయా సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాధను నియమిస్తూ మరోసారి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఇలా, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్, రుయా సూపరింటెండెంట్ పోస్టుల భర్తీలో గందరగోళం నెలకొంది. ఆయా పోస్టులకు సంబంధించి డాక్టర్ రవిప్రభు, డాక్టర్ రాధ నియామకాల్లో మూడుసార్లు ఉత్తర్వులు మారాయి.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

ప్రశాంతంగా మెయిన్స్ రాత పరీక్షలు

- 623 మంది హాజరు



తిరుపతి(కలెక్టరేట్), మే 3(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. తిరుపతిలోని ఎస్‌డీహెచ్‌ఆర్ కళాశాల, ఎస్వీయూ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్, లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్‌లో ఈనెల 9వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. తొలిరోజైన శనివారం 911 మందికి గాను 623 మంది హాజరైనట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్సులో పరీక్షలు జరుగుతున్న తీరును కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఆయా కేంద్రాల్లో వసతులు కల్పించారు.

ఎండ.. వాన

- చల్లబడిన తిరుమల కొండ



ఒకవైపు వేసవి సెగలతో ఉడికిపోతూ ఉంటే శనివారం తిరుమల కొండమీద వాన కురవడంతో చల్లబడింది. ఉదయం నుంచీ ఎండ, ఉక్కపోతతో భక్తులు అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం తర్వాత నల్లని మబ్బులు కమ్ముకుని 3.30 ప్రాంతంలో వాన మొదలైంది. దాదాపు ముక్కాలు గంటపాటు కురిసిన వానలో భక్తులు తడుస్తూ ఆనందించారు. ఆ తర్వాత చల్లటి గాలులతో తిరుమల కొండపై ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. కాగా, శనివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. వాహనాలే కాదు నడక దారులూ కిటకిటలాడుతూ కనిపించాయి. సర్వదర్శనానికి నేరుగా క్యూలైన్‌లో వెళ్లేవారికి 14 గంటలకు పైగానే సమయం పడుతోంది. గదులు లభించని భక్తులు వసతి సముదాయాలు, జర్మన్ షెడ్లు, చెట్ల కిందా సేద తీరుతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఉదయం ఎండకు షెడ్లకిందకు చేరిన భక్తులు



మధ్యాహ్నం తర్వాత వానకు తడుస్తూ...

పీఎన్‌బీ ఏటీఎం చోరీకి యత్నం

- ముగ్గురు తమిళనాడు దొంగలను వెంటాడి పట్టుకున్న తిరుపతి పోలీసులు



దుండగులు దోపిడీకి యత్నించిన ఏటీఎం

తిరుపతి(నేరవిభాగం), మే 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) ఏటీఎం పగులకొట్టి దోపిడీకి యత్నించిన తమిళనాడుకు చెందిన ముగ్గురు దుండగులను శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా మైనర్లే. వీరిని వెంటాడి పట్టుకొనే క్రమంలో కిందపడిన వెస్ట్ కానిస్టేబుల్ రమేష్‌కు గాయాలయ్యాయి. వెస్ట్ ఎస్‌ఐ అనిల్‌కుమార్ కథనం మేరకు.. బాలాజీ కాలనీలోని పీఎన్‌బీ ఏటీఎంలో డబ్బులు అపహరించడానికి ముగ్గురు మైనర్ దుండగులు యత్నించారు. ఏటీఎంను ఇనుప రాడ్‌తో పగులగొట్టే క్రమంలో ముంబైలోని బ్యాంకు సర్వలెన్సు టీమ్ సీసీ కెమెరాల్లో గమనించారు. వారి సమాచారంతో తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం పోలీసులను అప్రమత్తం చేశారు. వెస్ట్ ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో రాత్రి గస్తీలో ఉన్న హెడ్ కానిస్టేబుళ్ళు బాలమురళి, మల్లికార్జున, కానిస్టేబుళ్లు రమేష్, నాగార్జున ఘటనాస్థలం వద్దకు వెళ్లారు. రక్షక్ డ్రైవర్ నరేష్, పోలీసులు వాహనం దిగగానే ప్రధాన నిందితుడు రాడ్‌తో పరుగెత్తుకుంటూ వెళ్తుండగా వెంబడించి పట్టుకున్నారు. ఈ వెంటాడే క్రమంలో కిందపడిన కానిస్టేబుల్ రమేష్‌కు భుజంపై ఎముక విరగడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పట్టుబడిన ముగ్గురూ మైనర్లే. వీరు గతంలో తమిళనాడు, ఏపీలో పలు చోట్ల ఏటీఎంలు పగులకొట్టి నగదు దొంగిలించినట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్‌ఐ అనిల్‌కుమార్, దుండగులను విచారిస్తున్నారు.

శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద భక్తుల మధ్య ఘర్షణ



ఘర్షణకు దిగిన భక్తులను అడ్డుకుంటున్న భద్రతా సిబ్బంది, అధికారులు

తిరుమల, మే3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద భక్తుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. శనివారం వీఐపీ బ్రేక్ అనంతరం సర్వదర్శనాలు మొదలైన కొంతసేపటికి భక్తులు ఒకరిని ఒకరు నెట్టుకుంటూ వేగంగా ఆలయంలోకి ప్రవేశించారు. ఈక్రమంలో రెండు బృందాల మధ్య మహాద్వారం వద్ద మాటామాట పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు దాడికి దిగారు. ఇంతలో పక్కనే ఉన్న భద్రతా సిబ్బంది, ఆలయ అధికారులు జోక్యం చేసుకుని విడదీయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. స్వామి దర్శనానికి వచ్చి గొడవపడటం ఏంటని ఆలయ అధికారులు సర్దిచెప్పడంతో ఎవరిపాటికి వారు దర్శనానికి వెళ్లిపోయారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ముందు వెళుతున్న లారీని ఢీకొన్న మరో లారీ
ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


మృతిచెందిన సతీష్

నాయుడుపేట టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - విన్నమాల జాతీయ రహదారి సమీపంలో రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాదుకు చెందిన సతీష్, జ్ఞానముని లారీలో చెన్నైకు వెళుతూ విన్నమాల వద్ద ముందు వెళుతున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సతీష్, జ్ఞానముని లారీలో ఇరుక్కుపోయారు. వారిని స్థానికులు బయటకు తీసి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ సతీష్(30) మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుర్రుమంటున్న సూరీడు
ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు



నిర్మానుషంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు రోడ్డు

గూడూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపం రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉక్కపోతను తట్టుకోలేకపోతున్నారు. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు సుమారు 38 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే ఎండ చురుక్కుమంటోంది. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టణంలోని రోడ్లు, కూడళ్లు నిర్మానుషంగా దర్శనమిస్తున్నాయి. రోడ్ల వెంబడి దుకాణాలు నిర్వహించే చిరువ్యాపారులు ఎండ తీవ్రతను తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. ఉక్కపోత అధికంగా ఉండడంతో చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సంయుక్త

తడ మే 3(ఆంధ్రజ్యోతి): కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూళ్లూరుపేట లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్ పర్సన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సంయుక్త పేర్కొన్నారు. శనివారం మండలంలోని మాంబట్టు అపాచీ పరిశ్రమలో కార్మిక చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కార్మికుల హక్కులు, చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కరీం, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నత్తం శ్రీనివాసులు, న్యాయవాదులు విజయమ్మ, చక్రవర్తి, మాలకొండరెడ్డి, హేమంత్, చలపతి, సౌమ్య సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా నీటి తొట్టెల నిర్మాణం
మూడు రోజులకే కూలిపోయిన వైనం


జార్లపాడులో కూలిన నీటితొట్టె

బాలాయపల్లి, మే3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిగిలాం పంచాయతీ జార్లపాడు గ్రామంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టె కూలిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఎండల తీవ్రత దృష్ట్యా మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ప్రతి గ్రామంలో నీటి తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బాలాయపల్లి మండలంలో ఉపాధి నిధులు రూ.30 వేల వ్యయంతో ఒక్కో పంచాయతీలో రెండు, మూడు చొప్పున నీటి తొట్టెలు నిర్మిస్తున్నారు. జార్లపాడులో నిర్మించిన నీటి తొట్టె మూడు రోజులకే కూలిపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్లు నాసిరకంగా నిర్మాణాలు చేపట్టారని, దీంతో మూడు రోజులకే నీటి తొట్టె కూలిపోయిందని జార్లపాడు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

సర్వీస్ రోడ్లు నిర్మించండి


కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెళ్లకూరు, మే 3(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట నుంచి తూర్పు కనుపూరు వరకు నూతనంగా నిర్మిస్తున్న సాగరమాల జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించాలని ఆ ప్రాంత రైతులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసిన రైతులు నాయుడుపేట నుంచి చిలమత్తూరు వరకు పంట పొలాల మధ్యలో సాగరమాల రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పొలాలు రెండు భాగాలుగా విడిపోయాయని వివరించారు. దీంతో వ్యవసాయ పనులు చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కార్యక్రమంలో జలదంకి వెంకటకృష్ణారెడ్డి, కామిరెడ్డి విజయసారధిరెడ్డి, గుండాల సురేష్‌రెడ్డి, సన్నారెడ్డి హరినాథ్‌రెడ్డి, కామిరెడ్డి సురేష్‌రెడ్డి, సన్నారెడ్డి, భవదీప్‌రెడ్డి, మచ్చా భాస్కర్ పాల్గొన్నారు.

ఇంటి పన్నులను ఆన్‌లైన్ చేయాలి

తడ, మే 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో వసూలుచేసే ఇంటి పన్నులను ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీవో విజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇక నుంచి రాతపూర్వక బిల్లుల ద్వారా పన్ను వసూళ్లు చేయరాదని స్పష్టం చేశారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు గాబ్రియేల్, మస్తాన్, పద్మా, బాబు, శేషారావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు

కోట, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి, శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలకేంద్ర వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 6గంటల నుంచి 10గంటల వరకు వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ మునిరవిచంద్రతెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గైనకాలజిస్టు రాజీనామా

కోట, మే 3 (ఆంధ్రజ్యోతి): కోటలోని ప్రభుత్వాస్పత్రిలో గైనకాలజిస్టుగా పనిచేస్తున్న డాక్టర్ రూప శనివారం తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. రెండేళ్లుగా ఇక్కడి ఆస్పత్రిలో పనిచేస్తున్న రూప పరిపాలన విభాగం ఇన్‌చార్జ్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. కొద్ది రోజులుగా మెడికల్ లీవ్‌లో ఉన్న ఆమె తన ఉద్యోగానికి రాజీనామా చేసి, ఆ పత్రాలను ఫ్యాక్స్ ద్వారా నెల్లూరు, తిరుపతి జిల్లాల ఆరోగ్య శాఖ అధికారులకు పంపారు. ఆమె స్థానంలో ఆస్పత్రి పరిపాలన విభాగం ఇన్‌చార్జ్‌గా అక్కడే పనిచేస్తున్న చిన్నపిల్లల వైద్యాధికారి పోతగంటి దోంప్రియరావును నియమించారు.



మంగళంపాడులో దుక్కిదున్ని సిద్ధం చేసిన పొలం - ఇలుపూరులో వరినాట్లు వేస్తున్న కూలీలు

ఎడగారు సాగు... ముమ్మరంగా వరినాట్లు

సూళ్లూరుపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఎడగారు సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో ముమ్మరంగా వరినాట్లు సాగుతున్నాయి. బోర్ల కింద ఆయకట్టు పొలాల్లో ఏప్రిల్ మొదటి వారంలోనే నారుపోసి పొలాలను దుక్కిదున్ని నాట్లకు సిద్ధం చేశారు. సూళ్లూరుపేట మండలంలోని మంగానెల్లూరు, మంగళంపాడు, ఇలుపూరు, దామానెల్లూరు, సుగ్గుపల్లి, వెలగలపొన్నూరు, సుద్దమడుగుతాగేలి, కోటపోలూరు, సామంతమల్లాం, పడమటి కండ్రిగ గ్రామాల్లో రైతులు వరినాట్లు వేస్తున్నారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో దాదాపు 3 వేల ఎకరాల్లో 1010 రకం వరినాట్లు వేస్తున్నారు. తెలుగుగంగ నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేస్తే చెరువుల కింద ఆయకట్టులో కూడా వరిసాగు చేసే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

పథకం ప్రకారమే టీడీపీ నేత గురుమూర్తి హత్య
నలుగురి అరెస్టు ● డీఎస్పీ చెంచుబాబు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి

నాయుడుపేట టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): పథకం ప్రకారమే టీడీపీ నేత గురుమూర్తిని హత్య చేసినట్లు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. గురుమూర్తి స్వగ్రామమైన ఓజిలి మండలం అత్తివరంలో ఇటీవల రెండు వర్గాల మధ్య వివాదం జరగడంతో కేసులు నమోదయ్యాయి. గురుమూర్తి ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్న కక్షతో ఆయన ప్రత్యర్థులు హత్యకు పథకం రచించారు. అత్తివరం గ్రామానికి చెందిన మల్లి చెందు, మల్లి శ్రీనివాసులు, మల్లి శరత్, వీరి సమీప బంధువైన నెల్లూరుకు చెందిన యలమల సాయి కలిసి హత్యకు ప్రణాళిక రూపొందించుకున్నారు. పదిరోజుల నుంచే గురుమూర్తిని వెంబడిస్తూ వచ్చారు. ఏప్రిల్ 27వ తేదీ రాత్రి గురుమూర్తి, అత్తివరం గ్రామానికే చెందిన అనిల్‌రెడ్డితో కలిసి మోటరు సైకిల్‌పై నాయుడుపేట నుంచి ఇంటికి వెళుతుండగా వారిని ఓ నిందితుడు బైక్‌పై వెంబడించారు. మరో ముగ్గురు మినీ వ్యానులో బయలుదేరారు. నాయుడుపేట మండలం ద్వారకాపురం సమీపంలో వెళుతున్న గురుమూర్తి మోటరు సైకిల్‌ను మినీవ్యానుతో వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో గురుమూర్తి మినీవ్యానులో ఇరుక్కోవడంతో అర కిలోమీటరు వరకు రోడ్డుమీద ఈడ్చుకుంటూ వెళ్లింది. తీవ్రంగా గాయపడిన ఆయన మృతిచెంది వ్యానుకు ఇరుక్కుపోవడంతో వాహనాన్ని అక్కడే వదిలేసి నిందితులు పారిపోయారు. తన తండ్రిని పథకం ప్రకారమే హత్య చేశారని గురుమూర్తి కుమారుడు గురుతేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు మల్లి చందుకుమార్, మల్లి శ్రీనివాసులు, మల్లి శరత్, యనమల సాయిలను శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు డీఎస్పీ వెల్లడించారు. అలాగే నిందితుల నుంచి మినీ వ్యాన్, మోటరు సైకిల్, స్క్రూడ్రైవర్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

అధికారుల కనుసన్నల్లోనే ఇసుక, గ్రావెల్ మాఫియా: చింతా



ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సూళ్లూరుపేట, మే 3(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా పోలీస్, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి పెరిగిపోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పనులు చేయకుండా మాయ మాటలు చెప్తున్నాయన్నారు. ఎంతో మందికి ఉపాధి అవకాశాలు దొరికే దుగరాజపట్టణం పోర్టు, మన్నవరం బెల్ కంపెనీ పనులు ప్రారంభించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2015లో ప్రధాని మోదీ అమరావతి శంకుస్థాపనకు వచ్చి చెంబునీళ్లు, మట్టి ఇచ్చాడని, ఇప్పుడు రెండోసారి వచ్చి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు దగ్గు తగ్గేందుకు విక్స్ బిళ్లలు ఇచ్చి యోగా గురించి మాట్లాడి వెళ్లాడే తప్ప రాజధానికి ఎలాంటి నిధులు కేటాయించలేదని విమర్శించారు. సూళ్లూరుపేట తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయంలో అవినీతి పెరిగిపోయిందని, అధికారులు అధికార పార్టీ నాయకులకు దాసోహంగా మారిపోయారన్నారు. గూడూరు వద్దనున్న సిలికా, కాళంగి, స్వర్ణముఖిలో ఇసుక, గ్రావెల్ తవ్వకాలను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందనమూడి శివ, గాడి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కురుగొండ్లకు సన్మానం


ఎమ్మెల్యే కురుగొండ్లను శాలువాతో సత్కరిస్తున్న నాగేశ్వరావు

వెంకటగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు నెల్లూరు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరావు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం వెంకటగిరికి విచ్చేసిన ఆయన ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి తనకు పదవి వచ్చేందుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బీరం రాజేశ్వరావు, చెలికం మధుసూదన రెడ్డి, గొల్లగుంట వెంకటముని, చాట్లముని రత్నం, భాస్కర్‌రెడ్డి, తోటా రామచంద్రయ్య, కూని రవి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేక అలంకరించి పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.

వాటర్‌షెడ్ అభివృద్ధి, జీవనోపాధిపై శిక్షణ

తడ, మే 3 (ఆంధ్రజ్యోతి): పులికాట్ పరిధిలో వాటర్‌షెడ్ అభివృద్ధి, జీవనోపాధిపై అవగాహన సదస్సు జరిగింది. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పులికాట్ రేంజర్ నరసింహారావు మాట్లాడుతూ వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు సమాజానికి, రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. మత్స్య సంపదను పెంచడం ద్వారా వారి జీవనోపాధి మెరుగవుతుందని చెప్పారు. వార్షిక కార్యచరణ ప్రణాళికపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘురెడ్డి, ఎంపీడీవో విజయ్‌కుమార్, యూఎన్‌డీపీ డాక్టర్ యశ్వంత్, రామపురం సర్పంచ్ శ్రీనివాసన్, వ్యవసాయ అధికారి కిరణ్, వెలుగు ఏపీఎం రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రేంజర్ నరసింహారావు

ఓసూరమ్మ కొలుపు ఉత్సవాలకు
ఎమ్మెల్యే రూ.లక్ష వితరణ

నాయుడుపేట టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన భీమవరంలో నిర్వహించనున్న ఓసూరమ్మ కొలుపు ఉత్సవాలకు ఎమ్మెల్యే విజయశ్రీ రూ.లక్ష విరాళం అందజేశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం రాత్రి భీమవరం గ్రామస్తులకు నగదును సర్పంచు అమృత సరళతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, గంగాప్రసాద్, గోను బాబు, తుపాకుల కన్నెమ్మ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో వల్లిపేడు విద్యార్థిని ప్రతిభ


హారిక, ఉద్యార్థి మల్హోత్రా, పార్థివకృష్ణ

చిల్లకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వల్లిపేడు గ్రామానికి చెందిన పార్థివకృష్ణ టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభచాటింది. తిరుపతిలోని వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం చదువుతున్న పార్థివకృష్ణ ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో శనివారం జరిగిన జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ లీగ్ పోటీల్లో హైదరాబాద్ యూనివర్శిటీ జట్టుపై విజయం సాధించి క్వాటర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఈ జట్టులో పార్థివకృష్ణతో పాటు హారిక, ఉద్యార్థి మల్హోత్రా ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


అంబులెన్స్‌లో ఆస్పత్రికి వెళుతున్న క్షతగాత్రులు

పెళ్లకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిలో దొడ్లవారిమిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు వెళ్తున్న లారీని అదే వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

అనాథ శవానికి అంత్యక్రియలు

వెంకటగిరి టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ భిక్షగాడు మరణించాడు. శనివారం ఉదయం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. అనంతరం మున్సిపాలిటీ వారి ఆధ్వర్యంలో సీఐ రమణ అంత్యక్రియలు నిరహించి మానవత్వం చాటుకున్నారు. ఆయనను పలువురు ప్రసంశించారు.


అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న సీఐ రమణ

కుప్పలు కుప్పలుగా చనిపోయిన కోళ్లు
కొణ్ణంబట్టులో కలకలం

సూళ్లూరుపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం కొణ్ణంబట్టుకు వెళ్లే రోడ్డు పక్కన చనిపోయిన కోళ్లు కుప్పలు కుప్పలుగా పడి వుండటాన్ని శనివారం ఆ గ్రామస్తులు గుర్తించారు. సూళ్లూరుపేటలో చికెన్ దుకాణాలు నిర్వహించే వారు చనిపోయిన కోళ్లను శుక్రవారం రాత్రి వాహనంలో తీసుకెళ్లి పడేసినట్లు చెబుతున్నారు. అయితే పెద్దసంఖ్యలో కోళ్లు ఎందుకు చనిపోయాయి.. ఏమైనా రోగాలా లేక ఇంకేమైనా జరిగిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు పక్కన చనిపోయిన కోళ్లు పడేయడంతో దుర్వాసన వస్తోందని, ఈ ఘటనకు పాల్పడిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

రూ.3 కోట్లతో లింకు రోడ్ల అభివృద్ధి

గూడూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గంలో లింకురోడ్ల అభివృద్ధికి నాబార్డ్, ఆర్‌డీఎఫ్ నిధులు రూ.3 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ శనివారం తెలిపారు. లింకు రోడ్లను అభివృద్ధి పరిచేందుకు నిధులు మంజూరు చేసిన ప్రధాని మోదీకి, సీఎం చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం


ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం

నాయుపేట టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీడీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అదనంగా 17ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో పాటు తుమ్మూరు సబ్‌స్టేషన్‌లో నూతనంగా 11కేవీ బ్రేకర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయ్‌భాస్కర్‌రెడ్డి, రఫీ, గంగాప్రసాద్, చంద్రారెడ్డి, చేవూరు చెంగయ్య, మణి, సుబ్బారావు, విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసులు, డీఈ వరప్రసాద్‌రెడ్డి, ఏఈ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల సేవలను స్మరించుకుందాం

గూడూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి జ్ఞాపకార్థ మొక్కలు నాటే కార్యక్రమాన్ని అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్ ప్రారంభించారు. శనివారం మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ వర్ధంతి సందర్భంగా స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పర్యావరణ ప్రేమికుడు శ్యామ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

శీనయ్య కుటుంబానికి న్యాయం చేయండి

కోట, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి పంచాయతీ నారుమిట్ట గిరిజన కాలనీకి చెందిన పొన్నూరు శీనయ్య కుటుంబాన్ని ఆదుకుని న్యాయం చేయాలని శనివారం ఆ కాలనీ గిరిజనులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. గత నెలలో మోటర్ బైక్ ఢీకొని శీనయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబం వీధిన పడిందన్నారు. నిరుపేద అయిన శీనయ్య కుటుంబానికి పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.